ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 30 నవంబరు 2024

వంటగదిని పరిశీలిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మెరుగైన విద్యను అందించాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు.. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవగుడిపల్లె కేజీబీవీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను ఉపాధ్యాయులు, వార్డెన్లు కన్నబిడ్డల్లా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ సమస్యలను స్వయంగా ఉన్నతాధికారులకు తెలియజేసేందుకు ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వంట గదులు, మరుగుదొడ్లు, పాఠశాల తరగతి గదులు, పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకం భోజనం అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వంట గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంట ఏజెన్సీలకు సూచించారు. రాత్రి సమయాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలను తరచూ తనిఖీ చేస్తుంటామని, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా కేజీబీవీ పాఠశాలలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి నూతన బోరును ప్రారంభించారు. త్వరలోనే మోటారు బిగించి విద్యార్థులకు నీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన తహసీల్దార్ ఖాజాబీ

● ఎమ్మెల్యేపై ఫిర్యాదంటూ ప్రచారం



మంత్రి నారా లోకేశ్‌తో తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్ ఖాజాబీ శుక్రవారం నారావారిపల్లెలో మంత్రి నారా లోకేశ్ ను కలవడం కలకలం సృష్టిస్తోంది. వివిధ పనుల మీద వచ్చే ప్రజలు, రైతుల నుంచి తహసీల్దార్, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, ఇటీవల వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి, తహసీల్దార్ లంచావతారంపై ఆరా తీశారు. దీంతో సెలవులో వెళ్లాలని ఎమ్మెల్యే, తహసీల్దార్‌కు సూచించారు. అనంతరం వీఆర్వోలు ఇచ్చిన సమాచారం మేరకు పైసలు ఇవ్వనిదే ఏ పని చేయడం లేదని ఎమ్మెల్యే, తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీని పై ఆ మేడమ్.. అవినీతి కథలెన్నో.. అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి స్పందించిన సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్.. ఆ అధికారికి అనుకూలంగా ఉన్నారనే ఆరోపణ లు ఎదుర్కొంటున్న వీఆర్వోలు ప్రసాద్, మాధవరెడ్డి, శ్రీరాములు, విజ్ఞాన్, మస్తాన్‌లను పిలిపించి విచారిం చారు. ఈ విచారణ వివరాలను ఆయన కలెక్టర్‌కు పంపినట్లు తెలిసింది. తహసీల్దార్ గురించి ఆంధ్రజ్యోతిలో వార్త వచ్చినప్పటి నుంచి ఆమె కార్యా లయానికి రాకుండా దూరంగా ఉంటున్నారు. అయితే ఉన్నట్లుండి.. సీఎం స్వగ్రామం నారావారిపల్లెలో ఆమె శుక్రవారం ప్రత్యక్షం కావడం సంచలనం రేపింది. అక్కడ రాష్ట్రమంత్రి నారా లోకేశ్‌ను కలిసి కొన్ని వివరాలతో కూడిన వినతిపత్రం ఇచ్చినట్లు సమాచారం. అలాగే రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కూడా కలిసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తహసీల్దార్, నారా లోకేశ్‌తో పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రిని కలిసి ఏమని ఫిర్యాదు చేసి ఉంటుందనే దానిపై రకరకాల ఊహా గానాలు వినిపిస్తున్నాయి. ఆమెను ఏరికోరి తెచ్చుకున్న ఎమ్మెల్యేకు ఎక్కడ బెడిసి కొట్టింది? అనేది పెద్ద హాట్ టాపిక్‌గా మారింది. వలసపల్లె గ్రామంలో భూములు ఆన్‌లైన్ చేయకుండా తహసీల్దార్‌పైన ఎమ్మెల్యే ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.. వీటి గురించి ఏమైనా ఫిర్యాదు చేసి ఉంటుందా.? సాధారణంగా మండల మెజిస్ట్రేట్.. తనపై వచ్చిన ఆరోపణలు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే.. ఉన్నతాధికారులకు చెప్పుకుంటారే కానీ.. మంత్రులు, రాజకీయ నాయకులను కలవరు. అయితే ఈమె లోకేశ్‌ను కలవడంతో ఈ పరిణామం ఎక్కడికి దారితీస్తుందోనని రెవెన్యూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

చుట్టూ పచ్చని పొలాలు.. మామిడి తోటలు.. అటవీ ప్రాంతానికి అతి చేరువలో ఉండే ఆ ఊరు సుండుపల్లె మండల పరిధిలోకి వస్తుంది. మండలాలు ఏర్పడినప్పటి నుంచి ఆ గ్రామం ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఆ ఊర్లో ఇప్పటికీ ఒక బడి లేదు.. గుడి లేదు.. జ్వరమొస్తే మందుబిళ్లలు ఇచ్చేవారూ ఉండరు.. అసలు వారికి సంక్షేమ పథకాలు అంటే పెన్షన్ తప్ప మరేదీ తెలీదు.. చెప్పేవారూ లేరు. రోడ్లు, వీధిలైట్లు, కనీస మౌలిక వసతులు కూడా లేవు. ఇన్ని లేని ఆ ఊర్లో ఒక్కటి మాత్రం ఉందండోయ్.. అదే పోలింగ్‌బూత్. వారిని మనుషులుగా గుర్తించకపోయినా ఓటర్లుగా మాత్రం గుర్తించారు నాయకులు. పనులు లేక.. పస్తులుండలేక.. పశువులు మేపుకుంటూ దుర్భర జీవనం గడుపుతున్న వారి గోడు వినేవారు కరువయ్యారు. అసలు అధికారులకు ఆ ఊరి పేరే తెలియదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఇదీ.. మండల కేంద్రానికి సుమారు 44 కి.మీ. దూరంలో ఉన్న దిన్నెల గ్రామ ప్రజల దుస్థితి.

మా వైపూ చూడండి సారూ..!



● దిన్నెల గ్రామం

● బడి లేదు.. గుడి లేదు..
● మందుబిళ్లలకు ఆసుపత్రి లేదు
● ఉపాధి పనులూ లేవు..
● పశువులు మేపుకుంటూ జీవిస్తున్నాం
● సమస్యలు చెప్పుకుందామన్నా ఎవరూ రారు
● ఇదీ.. దిన్నెల ప్రజల ఆవేదన



మూడు సంవత్సరాల క్రితం పాడైపోయిన తాగునీటి బోరు

సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆ ఊరు పేరు దిన్నెల. వీరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. చేస్తే వ్యవసాయం, లేదంటే ఆవులు, గేదెలు, గొర్రెలు మేపుకొని జీవనం సాగించిన దుర్భర పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రధాన కారణం మండల కేంద్రానికి 44 కిలోమీటర్ల దూరంలో ఉండడమే వీరికి శాపంగా మారింది. ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఎవ్వరూ అక్కడికి వెళ్లరు. వారి కష్టాలు తీర్చరు. అక్కడికి వెళ్లేదంతా ముడుంపాడు గ్రామ పంచాయతీకి చెందిన ఒక్క వీఆర్‌పీ మాత్రమే. నెలకు ఒక్కసారి మాత్రమే పెన్షన్ పంపిణీ కోసం వస్తారని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారాలు సైతం నిర్వహించరని, తమ బాధలు చెప్పుకుందామన్నా ఎవ్వరూ పట్టించుకోరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిన్నెలలో ఎగువపల్లె, దిగువపల్లె అని రెండు చిన్నపల్లెలు ఉన్నాయి. ఆ రెండు పల్లెల్లో 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. సుమారు 70 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఊరిలో బడి, గుడి లేకపోయినా పోలింగ్ బూత్ మాత్రం ఉంది. వీరిని కేవలం ఓటర్లుగా మాత్రమే చూస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోంది. వీరిని ఓటర్లుగా కాకుండా మండల వాసులుగా గుర్తించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దిన్నెలలో చిమ్మచీకట్లు

సాయంత్రం 6 గంటలు అయితే చిమ్మ చీకట్లు కమ్మేస్తాయి. అటవీ ప్రాంతం చుట్టూ తోటలు పొలాలు ఉండడంతో ఇళ్లలో నుంచి బయటికి వచ్చేందుకు కూడా వీలు కాదని గ్రామస్తులు చెబుతున్నారు. అప్పుడెప్పుడో పది సంవత్సరాల క్రితం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆ వీధి దీపాలు పాడైపోతే రెండు సంవత్సరాలకో మూడు సంవత్సరాలకో ఒకసారి వచ్చి పాడైపోయిన విద్యుత్ దీపాలకు కనెక్షన్ ఇచ్చి ఫొటోలు దిగి వెళ్లిపోతారు. ఆ తర్వాత మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేరని ఆరోపిస్తున్నారు. అసలు తాము ఎవరికి ఓటేశామో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నామని చెబుతున్నారు. ఓటు వేయించుకున్న ప్రజాప్రతినిధులు ఏడాదికి ఒక్కసారైనా వస్తే తమ సమస్యలు చెప్పుకుందామని వేయికళ్లతో ఎదురుచూస్తున్నామని, తమ గోడు విని పుణ్యం కట్టుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బోరు చెడిపోయి మూడేళ్లు..

దిన్నెల ఎగువపల్లెలో 3 సంవత్సరాల క్రితం తాగు నీటి బోరు పాడైపోయింది. నీరు తాగాలంటే వ్యవసాయ బోర్ల దగ్గరికి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దయనీయ పరిస్థితి. గ్రామ పంచాయతీ నిధులు లక్షల్లో డ్రా చేస్తున్నారు. దిన్నెల ప్రజల తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. పైగా ఊరి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వేరే ఊరి నుంచి ఎర్రవారిపాలెం మండలానికి చెందిన అధికారులు ఇతర ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. పాడైపోయిన తాగునీటి బోరును ఇప్పటి వరకు మరమ్మతులు చేయించలేదు. త్వరగా రిపేరు చేసి రెండు పల్లెలకు శాశ్వత తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాల ఊసే లేదు

ఆ ఊరిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అంటే పెన్షన్ మాత్రమే అని చాలా మందికి తెలుసు. పక్కా గృహాలు మంజూరు చేస్తారని, గత వైసీపీ ప్రభుత్వం ఇంటి పట్టాలు పంపిణీ చేసిందని, కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలు ఉన్నాయని, అర్హులకు అందుతున్నాయని చాలా మందికి తెలియదు. వారికి తెలిసిందల్లా ప్రతినెల పెన్షన్ పంపిణీ మాత్రమే. ఇక మూడు నెలలకు ఒకసారి రేషన్ బండిలో బియ్యం ఇస్తారు. ఇవి తప్ప ఇంకేమీ అందడం లేదని ఆ గ్రామంలోని మహిళలు, పురుషులు చెబుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి ఇంటికి ఏడాదికి వంద రోజుల పని కల్పిస్తున్నారు. అయితే దిన్నెల గ్రామంలో మాత్రం ఉపాధి హామీ పనులు కల్పించడం లేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందా అని గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఆ పల్లె నేను చూడలేదు.. వెళ్తాను

రెండు రోజుల్లో దిన్నెలకు వెళ్లి సమస్యలపై ఆరా తీస్తాను. ఆ ఊరు ఎక్కడ ఉందో నాకు తెలియదు. మండల ప్రజలకు ఏ విధంగా అధికారులు సేవలు అందిస్తున్నారో అదేవిధంగా వారికీ సేవలు అందించేలా చూస్తాను. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తాను. ఉపాధి పనులు కల్పిస్తాము.

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

సంక్షేమ పథకాలు ఇప్పించండి..



ప్రభుత్వం నుంచి మాకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇప్పించండి. సంవత్సరానికి ఒక్కసారి కూడా అధికారులు ఎవరూ ఇక్కడికి వచ్చి మా సమస్యలు వినరు. తాగునీటి బోరు చెడిపోయి మూడు సంవత్సరాలవుతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. తాగునీటి సమస్య అధికంగా ఉంది. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాము. ప్రతి నెల రేషన్ బియ్యం కూడా పంపిణీ చేయరు.

- నరసింహరాజు, కూలి

వీధి దీపాలు, రోడ్లు వేయాలి..



వీధి దీపాలు లేవు. సరైన రోడ్లు లేవు. విషసర్పాలు ఇండ్లలోకి వస్తున్నాయి. కరెంటు సమస్య వేధిస్తోంది. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. మా ఊరు దాటి వేరే పల్లెకు పోవాలంటే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి దుర్భరంగా మారింది. కరెంటు సరిగ్గా ఉండడం లేదు. ఈ ప్రభుత్వంలోనైనా మా సమస్యలు పరిష్కరించాలి.

- ప్రభాకర్‌రెడ్డి, దిన్నెల ఎగువపల్లి

ఉపాధి పని కల్పించాలి..



చేస్తే వ్యవసాయం.. లేదంటే ఎటువంటి పని లేదు. ఖాళీగా ఉండాల్సి వస్తోంది. ఉపాధి పని కల్పిస్తే పనులు చేసుకుంటాము. ఉపాధి పనుల్లో భాగంగా వ్యవసాయ భూముల దగ్గరకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు చేయాలి. ఆవులు, గొర్రెలు మేతకు వెళ్లే రహదారి బాగు చేయాలి. ఉపాధి పనులు కల్పించి పుణ్యం కట్టుకోండి.

- వెంకట్రమణ, కూలీ



కంపచెట్ల మధ్య దిన్నెలకు పోయే రోడ్డు



దిన్నెల పోలింగ్ బూత్

వైసీపీ అక్రమాలపై
విజిలెన్స్ విచారణ
● ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టెండర్లు, పనుల నాణ్యతపై దర్యాప్తు 6
● నేడో రేపో విచారణ కమిషన్ రాక


రాళ్ల చేలల్లో.. రతనాల పైర్లు 7



ఆక్రమిస్తాం.. అడిగేవారెవరు..!!

● రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జా
● ఆర్‌అండ్‌బీ స్థలంలో వెలసిన రేకుల షెడ్లు, దుకాణాలు
● నిద్రావస్థలో అధికార యంత్రాంగం

ఆ స్థలం ఎంతో విలువైనది. రూ.కోట్లు విలువ చేస్తుంది. అటువంటి స్థలం గత కొన్నేళ్లుగా కబ్జాకు గురైంది. దర్జాగా ఆక్రమణదారులు రేకుల షెడ్లను వేసి అందులో దుకాణాలను నడుపుతున్నారు. సంవత్సరానికి లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. వీరంతా ఇల్లు లేని వారో.. పేదలో అనుకుంటే పొరపాటే. అందరూ ధనవంతులే. ఆక్రమణకు కాదేదీ అనర్హం అంటూ ఏకంగా నాలుగు రోడ్ల కూడలినే ఆక్రమించేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం నిద్రావస్థలో ఉన్నారు.



గాంధీజీ విగ్రహం వద్ద ఉన్న మాంసం దుకాణం

గాలివీడు, నవంబరు 29: మండల కేంద్రానికి సమీపంలోని గేటు వద్ద ఉన్న నాలుగు రోడ్ల కూడలిలో సర్వే నెంబరు 2266లో ఒక ఎకరా 80 సెంట్లు ఆర్‌అండ్‌బీకి చెందిన ప్రభుత్వ భూమి ఉంది. ప్రస్తుతం ఈ భూమి గాలివీడు-రాయచోటి, రాయచోటి- కోనంపేట రోడ్డుకు కూడలిలో ఉన్నది. ఈ స్థలం మెయిన్ రోడ్డుకు ఉండడం వల్ల అక్కడ స్థలాలు ఒక మూర లక్షల్లో ధర పలుకుతోంది. మొత్తం ప్రభుత్వ స్థలం అంతా కోట్లల్లో విలువ చేస్తుంది. అలాగే విలువైన ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది పలుకుబడి ఉన్న వారు ఆక్రమించుకొని దర్జాగా రేకుల షెడ్లను వేసుకొని దుకాణాలను నడుపుకుంటున్నారు. దుకాణాల ఏర్పాటులో గత నెల క్రితం ఇరువర్గాల వారికి ఘర్షణ కూడా జరిగింది. అయితే స్థానికుల ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం కొండను తవ్వి ఎలుకలను పట్టినట్లుగా ఆక్రమణదారులకు నోటీసులు, హెచ్చరికలతో మమ అనిపించారు. దీంతో రేకుల షెడ్లు కాస్తా దుకాణాలుగా మారిపోవడంతో ప్రజలు తీవ్ర స్థాయిలో అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అందులో కొంత రహదారి విస్తరణ కోసం అక్కడున్న బస్ షెల్టర్‌ను సైతం కూల్చివేసి చదును చేశారు. అయినా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న రేకుల షెడ్లు అలాగే ఉండడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. జిల్లా అధికారులు ఒత్తిడి తెచ్చినా, స్థానిక యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసినా ఆక్రమణదారులు మాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటికైనా కోట్లు విలువజేసే ప్రభుత్వ భూమి భూబకాసురుల చేతులోకి వెళ్లకుండా స్వాధీనం చేసుకోవాలని, ఇలాంటి ఆక్రమణలకు అడ్డుకట్ట పడేలా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న రేకుల షెడ్లు వెంటనే తొలగిస్తాము. ఆక్రమించిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఇప్పటికే ఆక్రమణదారులకు పలుమార్లు తాఖీదులు ఇచ్చాము. ఇక చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటాం.

- భాగ్యలత, తహసీల్దార్, గాలివీడు

'గాంధీ' చుట్టూ మాంసం దుకాణాలు

కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిం చుకొని రేకుల షెడ్లు వేసుకుని దర్జాగా కొంత మంది దుకాణాలను నడుపుకుంటుండగా మరికొంత మంది శాంతి, అహింసా మార్గంలో స్వతంత్రాన్ని తీసుకొచ్చిన గాంధీజీ విగ్రహం చుట్టూ మాంసం దుకాణాలను ఏ ర్పాటు చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. ప్రభు త్వ స్థలం కబ్జాపై ఎన్నో ఫిర్యాదులు చేసి నప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలా లు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం గాంధీజీ విగ్రహం చుట్టూ మాంసవిక్రయ కేంద్రాలు లేకుండా చూడాలని పలువురు అభ్యర్థిస్తున్నారు. అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రభు త్వమే బిల్డింగులను ఏర్పాటు చేసి బాడుగ లకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధి కారులు స్పందించి కబ్జాకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ స్థలం స్వాధీనం చేసుకుంటాం..

రహదారి విస్తరణలో ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. రెవెన్యూ అధికారులు, పోలీసుల సహకారంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయిస్తాము. ఇప్పటికే వారిని పలుమార్లు హెచ్చరించాము.

- వెంకటసుబ్బయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ



గాలివీడు గేటు సమీపంలో ఆర్‌అండ్‌బీ స్థలంలో వెలిసిన రేకుల షెడ్లు దుకాణాలు

కళాతపస్వి.. కొండారెడ్డి

చిన్నతనం నుంచే కళల పట్ల ఆసక్తి కనబరుస్తూ ఏడో తరగతిలోనే తోడబుట్టిన అన్నవద్దే చెక్కభజన నేర్చుకున్నారు. చెక్కభజన చేస్తుండగా కోలాటంపై ఆసక్తి పెంచుకుని సొంతంగా కోలాటం వేయడం నేర్చుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాక పలు అవార్డులు సాధించారు. విద్యార్థులకు సైన్స్‌ఫేర్‌పై అవగాహన కల్పిస్తూ వారిని తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకునేలా కృషి చేశారు. శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలో అద్భుతమైన ప్రదర్శనలతో మన్ననలు పొందారు. పలు ప్రభుత్వ పథకాల ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాణించారు. ఆయనలోని కళాకారుడు బయటికి వస్తే మాత్రం చెక్కభజనల సవ్వడితో సెహభాష్ అనిపిస్తారు. ఈతలో చేపతో పోటీ పడే చురుకుదనం ఆయనది. ఏ రంగంలోనైనా తనదైన ముద్ర వేయాల్సిందే. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశంసలు అందుకుంటున్న కళా తపస్వి కొండారెడ్డి.



ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు ● చెక్కభజనలో అందెవేసిన చేయి ● కోలాటంలో పట్టు సాధించిన వైనం ● ఆటపాటలు, ఈతలో దిట్ట ● ప్రజా చైతన్య వారధి ● అద్భుతమైన ప్రదర్శనలు అన్నింటా ప్రశంసలు

(ప్రొద్దుటూరు అర్బన్, ఆంధ్రజ్యోతి)

స్థానిక రామేశ్వరంలోని మిట్టమడి వీధి వాసి ఎస్ఆర్ కొండారెడ్డి చాపాడు మండలం పెద్దచి య్యపాడు వాసులు శివపురెడ్డి రామిరెడ్డి, లక్ష్మమ్మ గార్ల 5వ సంతానం. టెన్త్ వరకు గ్రామంలోనే పూర్తి చేశారు. ఐదో తరగతి నుంచే తండ్రికి పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉండే వారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదివారు. స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తిచేశారు. బీఎడ్ చదువు కునేందుకు కాలేజీ ఫీజు కోసం రామాపురంలో విద్యార్థులకు చెక్కభజనలో శిక్షణ ఇస్తూ వచ్చిన డబ్బుతో బీఎడ్ పూర్తిచేశారు.

ఉద్యోగ ప్రస్థానం

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయంతో ఖాజీపేట మండ లం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కంటిన్జెంట్ నిధుల ద్వారా నెల కు రూ. 360 వేత నంతో ఆరేళ్ల పని చేశారు. 1995లో జరిగిన ఉద్యోగ ని యామకాల్లో మొదటి సారిగా మోడంపల్లె పురపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ స్థలం కొరత ఉండడంతో పాఠశాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు చాలా కృషి చేశారు. 2007లో పదోన్నతిపై అని బీసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయి సైన్స్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీ సేందుకు ఈయన ఎంతో తాపత్రయపడ్డారు. 2011 బదీలీల్లో భాగంగా డీబీసీఎస్ పాఠశాలకు వచ్చారు. అదే ఆశయంతో వరుసగా నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను పంపారు. పంపిన ప్రతిసారి ఈయన ఆధ్వర్యంలో ప్రదర్శించిన నమూనాలు రాష్ట్ర స్థాయిలో మన్ననలు పొంది బహుమతులు సాధించడం గమనార్హం. 19వ జాతీ య సైన్స్ కాంగ్రెస్‌లో ఈయన ఆధ్వర్యంలోని బృందం ఏకంగా జాతీయ స్థాయి లో 'ఎ' లెవల్ ప్రదర్శనగా ఎంపికైంది. ఫిబ్రవరి 28న సైన్స్‌డే పురస్క రించుకుని విద్యార్థులు కూడా రూ. 25 వేల పారితోషికాన్ని అందుకున్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి విద్యార్థులు వెళుతున్నారంటే అక్కడ ఎస్ఆర్ కొండారెడ్డి కృషి ఉంటుందనేలా తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

అవార్డుల పరంపర

కొండారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు 22 అవార్డులు, 50కు పైగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎన్‌సీ ఎస్‌సీ ద్వారా 12, సైన్స్ ఫెయిర్ ద్వారా 3, ఇన్ స్పైర్ ద్వారా 3, ఏపీ సైన్స్ కాంగ్రెస్ ద్వారా 3, సదరన్ ద్వారా 1 అవార్డులు రావడంతో రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. చెక్కభజన కళా కారుడిగా ఇద్దరు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2024 నవంబరు 11న డాక్టర్ మౌలాన అబుల్ కలాం ఆజాద్ జన్మదినం రోజున మంత్రులు నారాలోకేష్, సత్యకుమార్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సమక్షంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు. ఏ పోటీల్లో అడుగు పెట్టినా బహుమతి వరించాల్సిందే..

చైతన్య కళాకారుడు..

కొండారెడ్డి ఏడో తరగతి చదువుతుండగానే చెక్కభజనలో ప్రావీణ్యులుగా పేరున్న తన అన్నను గురువుగా, అతన్ని స్ఫూర్తిగా తీసుకుని చెక్కభజన నేర్చుకున్నారు. కోలాటంలో ఆసక్తి పెంచుకుని ఆ కళపై కూడా పట్టుసాధించారు. అప్పటి నుంచి ఒక బ్యాచ్ ఏర్పాటు చేసుకుని చెక్కభజనలు, కోలాటం ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. వీరి ప్రదర్శనలకు మంచి గుర్తింపు రావడంతో సమాచార శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్షరరశ్మి, నీరు-మీరు, వనమహోత్సవాలు, జన్మభూమి, ఎయిడ్స్ లాంటి కార్యక్రమాల్లో చైతన్యవంతుల్ని చేసే దిశగా చెక్కభజనలు, పాటలు పాడుతూ పథకాల ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారు. ఇందు కోసం స్వయంగా కొండారెడ్డి పాటలు రచించేవారు. ఈయన ప్రతిభకు మెచ్చి అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 6వ మహానాడులో ప్రథమ శ్రేణి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

- 1992లో అక్షరరశ్మి కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్థన్ రెడ్డి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.
- 1992లో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 1987లో కడప జిల్లాలో చెక్కభజన ప్రదర్శనకు ప్రశంశలు లభించాయి.
- 1989లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లాలో జరిగిన చెక్కభజనకు అప్పటి కలెక్టర్ నుంచి బహుమతులు అందుకున్నారు.
- 2011 నుంచి విద్యార్థులకు చెక్కభజన, కోలాటంలో శిక్షణ ఇస్తూ పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

ఈతలోనూ దిట్ట..

కడప ద్విశతాబ్ది ఉత్సవాల్లో ఈత పోటీల్లో పాల్గొన్న కొండారెడ్డి రెండు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. బెస్ట్ స్ట్రోక్‌లో ప్రథమ బహుమతిగా స్వర్ణ పతకాన్ని సాధించారు. ఇక ఫ్రీ స్టైల్ విభాగంలో ద్వితీయ బహుమతితో రాణించారు. అటు విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూ ఇటు ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగిస్తూ కొండారెడ్డి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకుంటున్న కొండారెడ్డి

చెక్కభజనలో శిష్యబృందంతో కొండారెడ్డి (ఫైల్‌ఫొటో)


గడ్డి మందు పిచికారీతో ఎండిన పెరటి చెట్లు

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు


పూర్తిగా ఎండిన నిమ్మ చెట్టు
కాయలు సైతం ఎండిపోయిన మునగ చెట్టు

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బయనపల్లె వాసి కస్తూరి ఈశ్వరయ్య ఇంటి పెరటి చెట్లకు గడ్డి మందు పిచికారీ చేయడంతో చెట్లు చనిపోయాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... ఈశ్వరయ్య ఇంటి పెరట్లో పలు రకాల మొక్కలు నాటారు. ఇంటి ఆవరణలో నిమ్మ, మునగ, జామ, కరివేపాకు, చిక్కుడు, తమలపాకు పెంచుకుంటున్నాడు. అయితే మునగ చెట్టుకు గొంగళి పురుగు చీడ పట్టింది. కాగా ఇదే గ్రామస్తుడు గణేష్ ఈశ్వరయ్య ఇంటి ఆవరణలో ఉన్న మునగ చెట్టుకు పట్టిన చీడ ద్వారా తమ పిల్లలకు రోగాలు వస్తున్నాయని నెల 17న ఈశ్వరయ్య కుటుంబ సభ్యులతో గణేశ్ గొడవ పడ్డాడు. అదే రోజు గణేష్ మునగ చెట్టుపై గడ్డి మందును పిచికారీ చేయడంతో మునగ చెట్టు, నిమ్మ చెట్టు చనిపోయాయి. ఫలితంగా రెండు ఇళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తరచూ గొడవలు పడుతుంటారు. గ్రామంలో ఏదైనా గొడవలు వస్తే సాధ్యమైనంత వరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లరు. ఊరి పెద్దలే పరిష్కరిస్తారు. అయితే ఈ వివాదాన్ని వారు సైతం పరిష్కరించలేక పోవడంతో పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వినకపోవడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు.

ఇక్కడ నిధి, నిక్షేపాలు లేవు


- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

- కలెక్టర్ ఆదేశాలతో బోర్డు నాటిన అధికారులు


బోర్డు నాటుతున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలుగా బృహత్ శిలాయుగం నాటి సమాధులు ఉన్నట్లు ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దట్టమైన అడవి మధ్యన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 50 సమాధులు ఉన్నాయి. అవి కేవలం సమాధులు, ఆదిమానవుల జీవనానికి సాక్ష్యాలు మాత్రమే. ఇక్కడ ఎటువటి నిధి నిక్షేపాలు లేవని సుండుపల్లె తహసీల్దార్ దైవాదీనం ప్రకటించారు. ఇక్కడ ఉన్న సమాధులు, బండలతో నిర్మించిన గూళ్లను ఎవరూ కూల్చకూడదని ఆదేశించారు. ఎవరైనా ఆ సమాధులు ఉండే ప్రదేశానికి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాయవరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అంజనాస్వాతి ప్రకటించారు. అక్కడ నిర్మాణాల్లో బండలపై నాటి అపురూపమైన చిత్రాలున్నాయి. వాటిని కూల్చరాదన్నారు. గుప్త నిధులు లాంటి నిక్షేపాలు ఉన్నాయని, ఎవరైనా వాటిని కూలిస్తే అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ ఎటుంటి నిధులు లేవు. అజ్ఞాత వ్యక్తులకు ప్రవేశం లేదని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ పవన్‌కల్యాణ్‌నాయక్, వీఆర్ఏ శంకరయ్య, రెవెన్యూ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం



ములకలచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు సరిహద్దులోని తనకల్లు మండలం బింతలపల్లె రైతు శ్రీనివాసులు(45) పంట సాగు కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు. మదనపల్లె ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు సమాచారాన్ని తనకల్లు పోలీసులకు బదిలీ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు పెద్దివీడు విద్యార్థి



వీరబల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పెద్దివీడు రెడివారిపల్లె హైస్కూల్ విద్యార్థి రాజేశ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మధుసూదన్‌రాజు తెలిపారు. చిత్తూరు జిల్లా తవణంపల్లి జడ్పీ హైస్కూల్‌లో 22 నుంచి 24 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో జాతీయ పోటీలకు ఎంపికైన బాలుడు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది రాజేశ్‌ను అభినందించారు. పీడీ రవీంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

మున్సిపాలిటీలో టెండర్లు , పనుల నాణ్యతపై దర్యాప్తు ● నేడో రేపో విచారణ కమిషన్ రాక ● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదుతో సీఎంఓ ఆదేశాలు

ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమైంది. నేడో రేపో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి విచారణ కమిషన్ రానుందని విశ్వసనీయ సమాచారం. మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల వైసీపీ అక్రమాలపై 2024 జూలై 8న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 2024 ఆగస్టు 14న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌అండ్‌అర్బన్‌డెవలెప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన ఎమ్మెల్యే వరద ఫిర్యాదుపై విచారణ చేపట్టమని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. దీంతో డీఎంఏ అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో వేసిన విచారణ కమిషన్ నేడో రేపో ప్రొద్దుటూరుకు రానుంది. వివరాల్లోకెళితే...

వైసీపీడ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు ఎవరూ స్వేచ్ఛగా టెండర్లు వేయడానికి వీలు లేకుండాపోయిందని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా సింగల్ టెంటర్లకు వైసీపీ నేతల వత్తిళ్లకు అధికారులు అనుమతించడం, ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసుకుని మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టారని ఎమ్మెల్యే వరద అభియోగం. అంతేకాకుండా ఒకే పనిని నాలుగుగా విభజించి నిబంధనలు ఉల్లఘిచారనే ఆరోపణులన్నాయి. రెండు కోట్ల రూపాయల పనిని విభజించి రూ.40 లక్షల లోపు పనులుగా మార్చి మున్సిపల్ ఈఈ స్థాయిలోనే ఆమోదం తీసుకుని ఎస్ఈ వరకు వెళ్లకుండా పనులు చేపట్టారని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ పార్కు అభివృద్ధి, మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అంతేకాకుండా ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపణలున్నాయి. గాంధీరోడ్డు రామేశ్వరం రోడ్డు శివాలయం వీధి మైదుకూరు, ఎర్రగుంట్ల రోడ్డుల్లో డివైడర్ల నిర్మాణ పనులపై కూడా విచారించాలని ఎమ్మెల్యే కోరారు. తాత్కాలిక మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వ్యాపారులతో షెడ్ల నిర్మాణానికి అరుగుల ఏర్పాటుకు డబ్బు వసూళ్లు చేసి మున్సిపల్ నిధులతో తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగిందని ఆరోపించారు. వైసీపీ పాలనలో దాదాపు 1000 నుంచి 1200 వర్కులు జరిగాయని 100కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని ఇందులో వైసీపీ నేతలు టెండర్లలో అక్రమాలకు పాల్పడి పనులు దక్కించుకుని మున్సిపల్ ఆదాయినికి గండి కొట్టారని ఆరోపించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల సర్టిఫికెట్ లేకున్నా కొన్ని పనులకు బిల్లులు చేశారని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ స్థాయి అధికారి వైసీపీ నేతల అండతో పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, దాదాపు 200 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఇందులో కోట్ల రూపాయలు టౌన్ ప్లానింగ్ అధికారి సహా వైసీపీ ప్రజాప్రతినిధి పంచుకున్నారని ఆరోపణలున్నాయి. కొన్ని మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, వీటన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరిపి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

రెండు రోజుల్లో విచారణ కమిషన్ రానుండడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఐదేళ్లలో జరిగిన దాదాపు 1000 పనులకు సంబంధిత అన్ని రకాల ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ నాగరాజు, టీపీఓ చంద్రమోహన్ అక్రమ కట్టడాల నిర్మాణాలు, అనుమతులపై ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి

వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా చేసి వుండడంతో కొందరు ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి మొద లైంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలుచ అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలున్నా ఏసీపీ అధికారి కడప కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కమిషనర్లకు సైతం కొంత సమస్యలు తప్పదని భావిస్తున్నారు.

రైతులకు మైక్రో ఇరిగేషన్ ఒక వరం

90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ● జిల్లా వ్యాప్తంగా 30,950 హెక్టార్లు సాగు లక్ష్యం ● జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న


శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు మైక్రో ఇరిగేన్ ఒక వరమని జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లి మండలం ఓదివీడు రైతు సేవా కేంద్రంలో రాయచోటి ఉద్యానవనశాఖ డివిజన్ పరిధిలోని వీరబల్లి, టి. సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది శిక్షణలో ఆమె మాట్లాడుతూ డ్రిప్ అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ నీటి పరికరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 30,950 హెక్టార్లలో డ్రిప్ పరికరాల ద్వారా పంటల సాగు అమలు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 28,230 హెక్టార్లకు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 4,404 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో డ్రిప్ పరికరాలు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ ఉద్యాన, వ్యవసాయ, సెరికల్చర్ సహాయకులు అందరూ త్వరితగతిన మైక్రో ఇరిగేషన్ కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను సందర్శించి ప్రాథమిక సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ప్రాథమిక సర్వే, అంతిమ తనిఖీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సంబేపల్లె మండల ఉద్యాన అధికారి వనితాభాయి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్, కృష్ణానాయక్, వినోద్, సాయికిరన్, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 సంబంధించి జిల్లాకు రోల్ అబ్జర్వర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఐఏఎస్ 30న జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఓటరు జాబితా పురోగతిపై పరిశీలిచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ ఆఫీసర్సు హాజరు కావాలని, ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి అరెస్టు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకోకుండా యువతి మృతికి కారకుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన అంజలి కడప ఓ ఆస్పత్రిలో పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న భానుప్రసాద్, అంజలి ప్రేమించుకున్నారు. భానుప్రసాద్ పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 5న ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పండింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు భానుప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు.

భద్రతకే ప్రథమ ప్రాధాన్యం : డీఆర్ఎం

● రైల్వే రన్నింగ్ రూం, క్రూ రూం ప్రారంభం


ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్ రూంను ప్రారంభిస్తున్న డీఆర్ఎం విజయకుమార్

ఎర్రగుంట్ల, నవంబరు 29: రైల్వేలో భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజినల్ రైల్వే మేనేజర్ ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్లలో ఆయన రైల్వే ఇంజన్ డ్రైవర్స్ విశ్రాంతి (రన్నింగ్) భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ సెమినార్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యోగులు మానసిక వత్తిడిని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. క్షణాల్లో జరిగే ప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు చాలా సంయమనాన్ని పాటించాలన్నారు. కొందరు కడప, కొండాపురం, గుత్తి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఇది సరికాదన్నారు. లోకో డ్రైవర్లు, గార్డ్స్, ఇతర సిబ్బందికి భద్ర తపై ఆయన అనేక సూచనలిచ్చారు. ఇటీవల ప్రమాదాలు పెరిగిన మాట వాస్తమేనని, ఇకపై జీరో ప్రమాదాలు ఉండేలా ప్రతి ఉద్యోగి కృషిచేయాలని సీనియర్ డీఈఈ టీఆర్ఎస్ఓ వీరయ్య ఉద్యోగులకు సూచించారు. కాగా.. ఎర్రగుంట్లలో రైల్వే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని టెండర్ పిలిచినా ఇప్పటికీ ప్రారంభించలేదని డీఆర్ఎం దృష్టికి తీసుకురాగా డిజైన్ పూర్తయిందని పదిరోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ విస్తరణ పనులు అతిత్వరలో జరుగుతాయని అప్పుడు లిఫ్ట్, ఎస్కలేటర్ కూడా వస్తాయని సీనియర్ డీఈఈ టీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 29: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ఆయన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)హాలులో రెవెన్యూ సంబంధిత అంశాలపై కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, రెవెన్యూ అధికారులతో మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా రీసర్వే, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్, ఆధార్ కరెక్షన్స్, మ్యుటేషన్లకు సంబంధించి ప్రజలు వస్తుంటారని, తహసీల్దార్లు వీఆర్‌ఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యను పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో డీఆర్ఓ కె.మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, ఏడీ సర్వే భరత్‌కుమార్, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీ ల్దార్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్ల చేలల్లో... రతనాల పైర్లు

ఆ రెండు గ్రామాల రైతులకు రాళ్లు చేలు వరంలా మారాయి. మండలం నుంచి 13 కి.మీ దూరంలో చెన్నుపల్లె, గోపవరం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడకు సమీ పంలో పులివాగు.. ఆ పక్కన రాచ్చెరువు.. సింగరాయకొండ ఉన్నాయి. ఈ ప్రాంతంలో చిన్నపాటి రాళ్లతో కూడిన పొలం ఉంది. ఈ పొలంలో ఆ రెండు గ్రామాల రైతులు ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తూ.. సిరులు కురిపిస్తున్నాయి.


చెన్నుపల్లె పంచాయతీలో ఉన్న రాళ్లభూమి

- చెన్నుపల్లె, గోపవరం గ్రామాల రైతులకు వరంలా.. రాళ్ల పొలాలు
- ఏ పంట సాగు చేసినా... సిరులు కురిపిస్తున్న వైనం

కలసపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలోని చెన్నుపల్లె, గోపవరం గ్రామాలకు సంబంధించి పులివాగు.. సింగరాయకొండ ప్రాంతంలో 250 ఎకరాల రాళ్ల పొలం ఉంది. మరో పక్క రాచ్చెరువు ప్రాంతం ఉండటంతో రైతులంతా ఆ రాళ్లలోనే పైర్లు సాగు చేయడం మొదలు పెట్టారు. ఖరీఫ్ సీజన్‌లో సజ్జ, మినుము, కంది పైర్లు సాగు చేస్తారు. ఒక్కసారి వర్షం పడితే చాలు.. వెంటనే ట్రాక్టర్లతో విత్తనాలు చల్లి బండ


రాళ్ల భూమిలో సాగైన సజ్జపంట

రాళ్లను కలియదిప్పుతారు. రాళ్ల కింద పడిన విత్తనం ఆ తర్వాత వర్షం లేకపోయినా బెట్ట తట్టుకుని ఏపుగా పెరిగి అత్యధిక దిగుబడి వస్తుంది. ఇటీవల కొందరు రైతులు కూరగాయల పంటలు సాగు చేసి మంచదిగుబడులు సాధిస్తున్నారు. మిరప, టమోటా పైర్లకు కొద్దిపాటి నీటిని అందిస్తూ వేసవిలో కూడా పైర్లు పండిస్తున్నారు.

సాగు ఖర్చులు తక్కువే..



రాళ్లపైరులో సాగు ఖర్చులు తక్కువగానే ఉంటాయి. వర్షాలు పడినప్పుడు విత్తనాలు వేస్తే కలుపు మొక్కలు రావు. దీంతో కలుపు తీయడం కానీ, నివారణ మందు పిచికారి చేయడం కానీ చేయాల్సిన పని ఉండదు. దీంతో సాగు ఖర్చులు ఎకరాకు 5 నుంచి 10వేల రూపాయలు తగ్గుతున్నాయి.

\- ప్రసాద్, రైతు, చెన్నుపల్లె

రాళ్లను తీసివేస్తే దిగుబడి సున్నా

గతంలో కొందరు రైతులు రాళ్లను తొలగించి పైర్లను సాగు చేసేందుకు ప్రయత్నించారు. అయితే వారు విత్తనం వేసినా అది మొలక దశ నుంచి ఏ మాత్రం ఎదుగుదల లేక పైరు దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని తెలుసుకున్న రైతులు తిరిగి తొలగించిన చిన్నపాటి బండరాళ్లను మళ్లీ పొలాల్లో తోలారు.

వాతావరణ పరిస్థితే కారణం

రాళ్ల కింద పడిన విత్తనం కింద ఏ మాత్రం తడి ఆరకుండా చేస్తుంది. అంతేకాక ఎంత వర్షం పడినా మొక్కకు ఎక్కువ నీరు అందదు. అంతేకాకుండా బెట్ట పరిస్థితుల్లో రాత్రిపూట రాళ్లు చల్లగా మారి మొక్కకు తేమనందిస్తాయి. దీంతో ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

అధిక దిగుబడులు వస్తున్నాయి



రాళ్లపొలాల్లో అధిక దిగుబడులు వస్తున్నాయి. ఎటువంటి నీటి పారుదల లేకున్నా కేవలం మంచుతోనే మంచి పంటలు పండుతున్నాయి. ఎటువంటి పై పాటి ఎరువులు వేయడం లేదు. దీంతో ఖర్చు తగ్గడమే కాకుండా మంచి లాభాలు కూడా వస్తున్నాయి.

\-నాగేష్, గోపవరంపల్లె

బ్లాక్‌మెయిల్ చేసి వివాహమాడి..

- విడిపోయేందుకు డబ్బులు డిమాండ్
- ఇవ్వకపోతే కేసు పెడతామంటూ బెదిరింపులు
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుడు మస్తాన్‌వలి

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఉమ్మే సల్మా అనే మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసి వివాహం చేసుకుని.. లక్షల్లో డబ్బులను దండుకోవడమే కాక, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కేసు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరిస్తోందని బాధితుడు షేక్ మస్తాన్‌వలి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మస్తాన్‌వలి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలోని ఓ ట్రావెల్స్ డ్రైవరుగా తాను పనిచేస్తున్నానన్నారు. ఆ సమయంలో ఉమ్మే సల్మా తనకు పరిచయమైందని.. గతంలో వివాహమైందని, భర్తను వదిలేశానని మాయమాటలు చెప్పిందన్నారు. తరువాత కొన్ని రోజులకు సల్మాతో పాటు ఆమె చెల్లెలు, చెల్లెలు భర్తతో కలిసి బెదిరించి తనతో వివాహం చేశారన్నారు. ఆ తర్వాత తన నుంచి విడిపోయేందుకు అగ్రిమెంటు రాయించుకుని విడతల వారీగా రూ.లక్షల్లో డబ్బులను దండుకున్నారన్నారు. ఆమె గురించి తరువాత విచారించగా.. తనకు పరిచయం కాకముందు షేక్ అజ్మతుల్లాతో వివాహమై విడిపోయిందన్నారు. తరువాత షేక్ కరీముల్లా, గౌస్, ఆటోడ్రైవరు శివలను వివాహం చేసుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేసి అందినకాడికి డబ్బులను దండుకుందని ఆరోపించారు. ఆమె చెల్లెలు భర్త సాదిక్ ఇటీవల కడప తాలుకా పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, తాను డబ్బులు ఇవ్వకపోతే అతని చేత హత్య చేయిస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. ఉమ్మే సల్మా, ఆమె బంధువుల నుంచి ప్రాణ హాని ఉందని.. తనకు రక్షించి న్యాయం చేయాలని మస్తాన్‌వలి వేడుకున్నారు.

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌చాన్సలర్ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన జీవితం ఉద్వేగాల నియంత్రణ ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇన్‌లాస్ హాస్పిటల్ డైరెక్టరు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. వైవీయూ, ప్రధానమంత్రి ఉచ్చతార్ శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల పని, జీవిత నిలకడ, మానసిక సమ స్యలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో వత్తిడి దూరం చేయవచ్చన్నారు. సంతోషాన్నిచ్చే విషయాలను గుర్తించుకుని.. దుఃఖం విషయాలు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం అధ్యాపకులు అడిగిన మానసిక సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి మాట్లాడుతూ వైవీయూ అధ్యాపకులకు ఉపయోగపడే మంచి కార్యక్రమా న్ని సమన్వయం చేసిన చంద్రశేఖర్‌ను అభినందించారు. రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి ప్రణాళికబద్ధమైన జీవితం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్టారావులు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3,5 సెమిస్టర్లకు సంబంధించి 20819 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. హైపవర్ కమిటీ అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

2న ఉమ్మడి జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డిసెంబరు 2వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జేవీ సుబ్బన్న తెలిపారు. 20 సంవత్సరాలలోపు గల ఔత్సాహిక, అర్హత గల బాల బాలికలు ఎంపికలకు హాజరు కావాలన్నారు. బాలురు 70 కేజీలలోపు, బాలికలు 65 కేజీలలోపు బరువు వుండాలన్నారు. ఇతర వివరాలకు 9133480661 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కోసం ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సూచనల మేరకు 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 3గంటలకు డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ నగిలి రవిబాబు తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో విజేతలైన ముగ్గురు మహిళలకు ప్రైజ్‌మనీ కింద మొదటి బహుమతి రూ.1,111లు, రెండో బహుమతి రూ.777లు, మూడో బహుమతి రూ.555లు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో మహిళలు ముగ్గు పొడి, రంగులు తెచ్చుకోవాలని, పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు అందజేస్తామని రవిబాబు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష విరాళం

చక్రాయపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు ఆన్‌లైన్ ద్వారా లక్ష రూపాయలు విరాళం పంపించినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెన్నైకి చెందిన సముద్రాల భానుప్రసాద్, ధర్మపత్ని వందన, కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా పంపించారన్నారు. వీరికి స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నదాన విరాళ రసీదు పంపడం జరుగుతుందన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ...కేసు


ఘర్షణలో గాయపడిన వీరనారాయణరెడ్డి, రవిశంకర్

కమలాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారావుపల్లెలో గురువారం రాత్రి ఇరువర్గాల వారు ఘర్షణలకు పాల్పడగా పలువురికి గాయాలైనట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... అప్పారావుపల్లెలో ఒక వర్గా నికి చెందిన రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ఎల్లారెడ్డిలు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డి తదితరులు పాతకక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. దీంతో రవిశంకర్‌తో పాటు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డికి రక్తగాయాలయ్యాయి. వీరిని కమలాపురం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించామన్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక బేల్దారి ఆత్మహత్య



ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన అంకగాళ్ల నాగేంద్ర(24) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో పాటు అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలి


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలని ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మినీసెక్రటేరియట్‌లోని ఉద్యానశాఖ కార్యాలయంలో పులివెందుల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు కలిగిన రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18 లక్షల వరకు, 5 నుంచి 10 ఎకరాల్లోపు గల రైతులకు 70శాతం రాయితీతో రూ.3.46 లక్షల వరకు డ్రిప్ పరికరాలను అందజేస్తారన్నారు. 55శాతం మరియు 45శాతం సబ్సిడీలతో స్ప్రింక్లర్‌లు మంజూరు చేస్తామని.. ఈ విషయాన్ని రైతులకు చేరవేయాలన్నారు. ఏడీఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రబీలో పంటలు సాగుచేసిన రైతులందరు క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల వారీగా నిర్దేశిచిన డ్రిప్, తుంపర సేద్యాల లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. లింగాల ఏఓ రమేష్, పులివెందుల ఏఓ నాగలక్ష్మి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయండి

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


బలిజల ఆత్మీయ సమావేశం గురించి వివరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడా కన్వెన్షన్‌లో డిసెంబరు 22న నిర్వహిస్తున్న బలి జ, కాపు, తెలగ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం హరిటవర్స్‌లో బలిజ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 23శాతం మంది బలిజలు ఉన్నా.. బలిజలకు తగిన ప్రాధాన్యత లేదన్నారు. ఈనేపథ్యంలో కూటమి పార్టీలో గెలిచిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఛైర్మన్లకు సన్మానం, ఆత్మీయ సమావేశ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఎవరి స్వార్థం కోసం నిర్వహించడంలేదని, కేవలం బలిజల సమస్యల పరిష్కారానికి, హామీలు పొం దడానికి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని బలిజ సంఘాలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బలిజ నాయకులు బండిబాబు, మునెయ్య, రావు, చలపతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ఫైర్ ఎన్‌ఓసీ తప్పని సరి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసు పత్రుల యాజమాన్యాలు ప్రమాదాల నివారణకు అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల వలన రోగుల ప్రాణాలు అపాయంలో పడకుండా 2022లో గెజిట్ జారీ చేయడం జరి గిందన్నారు. ఎక్కువ పడకలు కలిగిన ఆసుపత్రుల యాజమాన్యాలు గతంలో జారీ చేసిన ఎన్‌వోసీలను రెన్యువల్ చేసుకోవాలని, కొత్తగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీని తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్‌వోసీ లేని వారు ఆసుపత్రులను నిర్వహించరాదని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు

దోమల నివారణ అందరి బాధ్యత

దోమల కుట్టడం వలన మలేరియా, డెంగీ, గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణ అందరి బాధ్యతగా భావించాలని కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ అన్నారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నగరంలోని చిన్నచౌకు, అన్నారెడ్డి వీధుల్లో జరిగింది. దోమల వలన వ్యాపించే విషజ్వరాలపై, నియంత్రకు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్యాధికారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. కాలనీల్లో ముళ్ల పొదలు లేకుండా చేసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా ఇళ్లలోని పాత్రలన్నింటిని శుభ్రంగా ఉంచకోవాలన్నారు. పరిసరాల్లో ముళ్ల పొద ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మి రెడ్డి, ఎంపీఈహెచ్ఈవో నిత్య పూజయ్య, ఏఎస్ఏ సరస్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బెల్టుషాపులు, సారా విక్రయాలపై కేసులు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు


గుర్రంగుంపు తాండాలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు, నాటుసారా విక్రయాలు, తయారీ చేస్తున్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ హెచ్చరించారు. చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు తాండలో శుక్రవారం గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గతంలో చుట్టుపక్కల నాటుసారా తయారు చేసేవారని, ఇప్పుడు కూడా అలా కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించకూడదని, ఎవరైనా నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, సారా లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనరు చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం తగదు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ

ఒంటిమిట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం తగదని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ. రమణ అన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయంలో సిబ్బంది పనితీరు, బకాయిలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. స్థానికంగా నివాసం ఉండి క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేయాలని, విద్యుత్ బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మొండిబకాయిలను వసూలు చేయాలని సూచించారు. అనంతరం వినియోగదారులతో మాట్లాడి అధికారుల పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ ఉదయ్ కుమార్, సిబ్బంది జనార్దన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి పత్రాలు అందజేయాలి

రామాపురం, నవంబరు 29: పక్కా గృహాలకు అర్హులైన వారందరూ తమ కులం, ఆదాయం ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్లను ఆయా మండలాల్లోని హౌసింగ్ కార్యాలయాల్లో అందజేయాలని హౌసింగ్ డీఈ కేఎస్ఎం ప్రసాద్ సూచించారు. శుక్రవారం రామాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ డాక్యుమెంట్లు అందజేయని పక్షంలో మంజూరైన పక్కా గృహాలు రద్దవుతాయన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాల న్నారు.

కౌలు సొమ్ము దుర్వినియోగంపై ఫిర్యాదు

రాజంపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రాంతంలోని ఆలయ భూముల కౌలు సొమ్ము దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నాయకుడు శ్రీధర్‌బాబు దేవాదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథంకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భూముల కౌలు ద్వారా ఆలయాలకు వచ్చిన ఆదాయం , ఖర్చు వివరాల్లో స్పష్టత లేదని, ఈ సొమ్మును దేవాదాయశాఖ అధికారులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఆరుగురిపై ఇప్పటికే కేసులు నమోదు చేశామన్నారు. పల్లె ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లె, దేగనివారిపల్లె నుంచి జిల్లా కేంద్రానికి ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శుక్రవారం ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఉదయం పోలీసులు సీజ్ చేశారు. ఈ ట్రాక్టర్‌ను తహసీల్దారుకు అప్పగించి, ఇద్దరిని బైండోవర్ చేశామని ఎస్సై తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

సుండుపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని గుల్లావాండ్ల పల్లికి చెందిన యువకుడు విష్ణువర్ధన్ అనారోగ్యం తాళలేక ఈ నెల 26న ఒంటికి నిప్పంటించుకున్నాడని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు మృతుడి మేనత్త బి. సుబ్బమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆదమరిస్తే.. ముప్పు..!

▸ అధిక లోడు వాహనాల రద్దీ ▸ అధ్వానంగా మారిన రహదారులు
▸ బండి కనుమలో పొంచివున్న ప్రమాదం ▸ స్థానికుల ఆందోళన



బండి కనుమలోని ప్రమాదకర మలుపు

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి నిర్వహణ లేకపోవడం, విచ్చలవిడిగా భారీ వాహనాలు సంచరిస్తుండడంతో మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. జంగాలపల్లెలో ఇసుక క్వారీ పేరుతో మూడేళ్ల కిందట తవ్వకాలు ప్రారంభించి పెద్ద ఎత్తున ఇసుక తవ్వి టిప్పర్లు, లారీల్లో బంగాలపల్లె, కమ్మపాలెం, సిద్దవటం మీదుగా ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు తరలించారు. ఈ వాహనాల అధిక లోడు కారణంగా జంగాలపల్లె సమీపంలోని కల్వర్టు దెబ్బతింది. క్రమంగా గుంతపడి పెద్దదిగా మారింది. ఇది రవాణాకు ఆటంకంగా మారడంతో ఏడాది క్రితం క్వారీ నిర్వాహకులు తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అయితే, వాహనాల రద్దీ తగ్గకపోవడంతో ఆ గుంత మళ్లీ ఏర్పడింది. దీంతో స్థానికులే చొరవ తీసుకుని కల్వర్టుపై ఉన్న గుంతను పూడ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదనీరు తూముల్లో నుంచి వెళ్లలేక, పొలాల్లో నుంచి నీరు ప్రవహించింది. దీంతో రైతులు కల్వర్టులోని తూముల్లో ఉన్న మట్టిని తొలగించడంతో గుంత మళ్లీ ప్రత్యక్షమైంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఆదమరిస్తే వాహనాలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. కమ్మపాళెం సమీపంలోని మలుపులో కూడా రహదారి దెబ్బతినింది. ఆర్ అండ్ బీ ఏఈ గంగిరెడ్డిని వివరణ కోరగా దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.



జంగాలపల్లె సమీపంలో దెబ్బతిన్న రహదారి

ప్రమాదాల మలుపు

ఇదిలా ఉండగా టక్కోలి బండి కనుమ రహదారిలో రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతోపాటు మలుపు ఉండడం తో వాహనాలు తిప్పడానికి చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో రక్షణగోడ కూడ దెబ్బతినడంతో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాహనాలు లోయలో పడే ప్రమాదం ఉంది. ఈ మధ్యనే కడప నుంచి మాచుపల్లెకు విద్యార్థులతో ప్రైవేటు పాఠశాల వాహనం ఈ ప్రాంతంలో మలుపు తిరగలేక అదుపు తప్పి రక్షణగోడను ఢీకొట్టింది. ఇప్పటికైనా అధికారులు బండికనుమ రహదారిని విస్తరించి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర్ వికాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు ఫోన్ చేసి సహకరించాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్లలోపు అబ్బాయికి వివాహం చేస్తే పెళ్లి కుమారుడితోపాటు , వారి తల్లిదండ్రులు, పాల్గొన్న వారికి రెండేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. వసతి గృహాల్లో చదివే విద్యార్థినులకు న్యాఫ్కిన్స్ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రామాపురం: తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. వీరారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీను, కడప జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్ రెడ్డి రామాపురం మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. .



విభిన్న ప్రతిభావంతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

యూజీడీ పనులకు శంకుస్థాపన

చిన్నమండెం: మండలంలోని కొత్తపల్లె ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంత్రి శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రతి వీధికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సిమెంటు రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం చిన్నమండెం గ్రామ పంచాయతీలో ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధి చేసిన నీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్‌వో ప్లాంట్ ప్రారంభించామన్నారు. బోరెడ్డిగారి పల్లెలోని తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించనుండడంతో ఉదయం ఆరు గంటల నుంచే ప్రజలు బారులు తీరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

పంట బీమాపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి పొలం వద్దకు వెళ్లి ఈ క్రాప్ నమోదు చేసి, పంట బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు బుక్కే చంద్రానాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎపీడీవో సభా భవనంలో వీరబల్లి, రామాపురం, గాలి వీడు, లక్కిరెడ్డిపల్లె మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగుచేసిన ప్రతి రైతు వివరాలు ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. వరి, వేరుశనగ, టమోటా పైర్లకు పంట బీమా పథకంపై అవగాహన కల్పించాలన్నారు. రబీలో సాగుచేసే రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు తెలియజేయాలన్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు సాధించే విధంగా ప్రణాళికలు తయారుచేసి వివరించాలన్నారు. కౌలు రైతులందరికీ బ్యాంక్ రుణాలు ఇప్పించాలన్నారు. పంట సాగుకు ముందు భూసార పరీక్షలు, పంట మార్పుతో దిగుబడులపై ప్రభావంపై అవగాహన కల్పించాలన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు, తుంపర సేద్యం పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె డివిజన్ వ్యవసాయ అధికారి జయరాణి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సుచిత్ర, ఏఓలు నాగమణి, స్వాతి, అనూష, చాన్‌ భాషా, నాగరాజు, రైతు సేవాకేంద్ర సిబ్బంది, పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలపై టీడీపీ నేతల సంబరాలు



కేక్ కట్‌చేసి విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం లక్ష సభ్యత్వాలు పూర్తి చేసుకొని నంబర్‌వన్ స్థానంలో ఉండడం, రాజంపేట పార్లమెంట్ పరిధిలో ముమ్మరంగా స భ్యత్వాలు జరుగుతూ రాష్ట్రంలో మొదటి వరుసలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఇడిమడకల కుమార్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి అమ్మినేని అజయ్, కమ్మసంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ చౌదరి, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు అనసూయదేవి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఎంపీపీ రాజమ్మ కేక్ కట్ చేశారు. కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి రెండు లక్షల సభ్యత్వాలు చేసేలా కృషి చేయాలని కోరారు. సీనియర్ నాయకులు శివరామిరెడ్డి, దామోదర్‌నాయుడు, యూనియన్‌బాషా, చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, మేకల మహబూబ్ బాషా, ఆనంద్‌నాయక్, యర్రంరెడ్డి, ఎన్ఆర్ఐ కువైట్ ఉపాధ్యక్షుడు బాషా, కంచన రెడ్డెయ్య, అమర్‌నాథరెడ్డి, జనార్దన్‌నాయుడు, రాయచోటి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు



గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా స్థానిక వీరభద్రాలయంలో భద్రకాళీ అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, రాహుకాల పూజలు చేశారు. ఈవో బీవీ రమణారెడ్డి, అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో వర్షం



రైల్వేకోడూరు ప్రాంతంలో కురుస్తున్న వర్షం

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నియోజవర్గ కేంద్రంలో శుక్రవారం వర్షం కురిసింది. తుఫాన్ కారణంగా జిల్లాకు భారీ వర్ష సూచన ఉండడంతో తహసీల్దార్ మహబూబ్ చాంద్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కాగా, రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేట, ధర్మాపురం, చిన్నలాలాపేట, గాండ్లవీధి తదితర ప్రాంతాలు నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మండలం లోని ఎస్. కొత్తపల్లె, శ్రీనివాసపురం ప్రాంతాల సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ పొంగితే గుంజననదికి భారీ వరద వచ్చే ప్రమాదం ఉంది. చెన్నై, నెల్లూరు, తిరుపతి ప్రాంతాలు రైల్వేకోడూరుకు దగ్గరగా ఉండడంతో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయంటున్నారు

పంచాయతీ భూమి ఆక్రమణపై కేసు నమోదు

సుండుపల్లి, నవబంరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిమేరపల్లి గ్రామ పంచాయతీకి చెందిన భూమిని ఆక్రమించి సాగు చేశారంటూ అదే గ్రామ పంచాయతీ ఎనుగుండువాండ్లపల్లికి చెందిన అయ్యప్పరెడ్డిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారన్నారు

పూరిగుడిసె దగ్ధం

చిట్వేలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్టీ కాలనీలో తుపాకుల వెంకటయ్య, రమణమ్మకు చెందిన పూరిగుడిసె గురువారం రాత్రి దగ్ధమైంది. రాజుగుంట సర్పంచ్ గుత్తి నరసింహ బాధిత కుటుంబానికి 10 వేల నగదు, నిత్యావసర సరకులు, తదితరాలను శుక్రవారం అందజేశారు ఈ కార్యక్రమంలో యానాది, రాజు, సీఆర్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్‌తో చర్చిస్తున్న సుగవాసి

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియా దేవికి రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కొందరు భూ ఆక్రమణలకు పాల్పడం దారుణమని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి టి.సంజీవరావు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, ఊటుకూరు మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, మండల టీడీపీ నాయకులు మేకా నరసింహులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కలదొడ్డి గిరిజనులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మొగిలి వినయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజనులు నివసిస్తున్న గ్రామాన్ని వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు ఎం. జయరామయ్య ఆధ్వర్యంలో ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుక్కలదొడ్డి గిరిజనులకు ప్రధానంగా రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇంటి స్థలాలు, పక్కాగృహాలు ఇవ్వడంతోపాటు, వారు నివసించే ప్రాంతాల్లో వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ అధ్యక్షురాలుగా కొరివి కవిత, ఉపాధ్యక్షులుగా నగిరిపాటి విజయ్‌కుమార్, కార్యదర్శిగా పన్నుబోయిన సుబ్బమ్మ, రావూరి గంగాదేవి, సాంబార్ మల్లికార్జున, ఖమ్మంపాటి రాజు, మరో 20 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లిక, రమణయ్య, కటారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యవర్గం ఎన్నిక

సంబేపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు పవన్‌నాయుడు కోరారు. శుక్రవారం సంబేపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. ఎటువంటి షరతులు లేకుండా తల్లికి వందనం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా చైతన్య, ఆనంద్, ఉపాధ్యక్షులుగా సమీర్, నాగరాజ్, వినయ్, హరినాయుడు, సహాయ కార్యదర్శులుగా నరసింహ, సంతోశ్‌కుమార్, నాగేంద్ర, చరణ్, సోహెల్ తదితరులను ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన అవసరం

రైల్వేకోడూరు(రూరల్), నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన అవసరమని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.కవిత సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు మండలాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మామిడి, అరటి, బొప్పాయి పంటలపై శిక్షణ ఇచ్చారు. పంట నమోదులో పొరపాట్లు లేకుండా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామకృష్ణ రాజు, అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వ్యవ సాయ అధికారి ఈ.శ్రీరాములు, మండల వ్యవసాయ అధికారి సుధాకర్, సిబ్బంది సందీప్ శ్రీకర్, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

గాలివీడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచే కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుంటుందని ఏపీజీబీ గాలివీడు మేనేజర్ వెంకటరావు తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు గాలివీడు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలోని ప్రతిభావంతులైన నిరుపేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు కమలమ్మ, అఖిల, రెడ్డిశ్వేతకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

పుల్లంపేట: మండలంలోని ఎస్‌బీవీడీ హైస్కూల్, కొత్తపేట జడ్పీ హైస్కూల్, కేజీబీవీ బాలికల పాఠశాలల్లో ఏపీజీబీ మేనేజర్ మూరి శ్రీనివాసులు ముగ్గురు విద్యార్థినులకు ఒక్కొక్కరికి 5 వేలు చొప్పున అందజేశారు.

మాదకద్రవ్యాలతో నష్టాలపై అవగాహన

రాజంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వినియోగంతో వ్యక్తిగత, కుటుంబంతోపాటు సమాజానికి కూడా హాని కలుగుతుందని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక తెలిపారు. శుక్రవారం మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్.ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ఏవోకు మంత్రి నివాళి

సంబేపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పుల్లమరాజు మృతి చెందడంతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మదనపల్లె మెడికల్ కాలేజీ పరిపాలన అధికారిగా పని చేస్తున్న పుల్లమరాజు గుండెనొప్పితో కడప హోలిస్టిక్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు

కనీస వేతనం అమలుకు వినతి

రాయచోటిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న డ్రైవర్లకు కనీసవేతనం రూ24,500లు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సీఐటీయూ నాయకులు, మున్సిపల్ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో ఆప్కాస్‌లో జాబితాలో 11 మంది డ్రైవర్లు స్వీపర్లుగానే కొనసాగుతున్నారని, వెంటనే వారిని డ్రైవర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.24,500లు అమలు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ డ్రైవర్ల సమస్యను ఆప్కాస్‌కు పంపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

'వడ్డెరలకు రాజ్యసభ సీటు కేటాయించాలి'

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్న హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిలబెట్టుకోవాలని ఏపీ వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కే. జీవానందం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని ఒక ప్రైవేటు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేధావుల ఫోరం యువజన విభాగం నాయకులతో కలిసి మాట్లాడాడు. రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకదానిని వడ్డెరలకు కేటాయించి చిత్తశుద్ధిని ప్రకటించుకోవాలన్నారు. ఈ సమావేశంలో గాలివీడు మండల నాయకుడు రవీంద్రబాబు, యువజన నాయకులు మారుతీప్రసాద్, రాజోళ్ల సాయిక్రిష్ణ, లోకేశ్వరలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పుల్లంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవ సముద్రం వడ్డిపల్లె లో 10 లక్షల రూపాయలతో నిధులతో సీసీ రోడ్డు పను లకు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. మండల ఇన్‌చార్జి ఆరే సుధాకర్‌నాయుడు, కేవీఎస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు క్విజ్ పోటీలు

సిద్దవటం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రంలోని జడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఏకలవ్య ఫౌం డేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు శుక్రవారం మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రథ మ స్థానంలో బాకరాపేట హైస్కూల్, ద్వితీయ స్థానంలో సిద్దవటం హైస్కూల్ విద్యార్థులు నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకటసుదర్శన్, ఉపాధ్యా యులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

కళాతపస్వి.. కొండారెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు ● చెక్కభజనలో అందెవేసిన చేయి ● కోలాటంలో పట్టు సాధించిన వైనం ● ఆటపాటలు, ఈతలో దిట్ట ● ప్రజా చైతన్య వారధి ● అద్భుతమైన ప్రదర్శనలు అన్నింటా ప్రశంసలు

చిన్నతనం నుంచే కళల పట్ల ఆసక్తి కనబరుస్తూ ఏడో తరగతిలోనే తోడబుట్టిన అన్నవద్దే చెక్కభజన నేర్చుకున్నారు. చెక్కభజన చేస్తుండగా కోలాటంపై ఆసక్తి పెంచుకుని సొంతంగా కోలాటం వేయడం నేర్చుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టాక పలు అవార్డులు సాధించారు. విద్యార్థులకు సైన్స్‌ఫేర్‌పై అవగాహన కల్పిస్తూ వారిని తీర్చిదిద్ది జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకునేలా కృషి చేశారు. శాస్త్ర సాంకేతిక ప్రదర్శనలో అద్భుతమైన ప్రదర్శనలతో మన్ననలు పొందారు. పలు ప్రభుత్వ పథకాల ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ రాణించారు. ఆయనలోని కళాకారుడు బయటికి వస్తే మాత్రం చెక్కభజనల సవ్వడితో సెహభాష్ అనిపిస్తారు. ఈతలో చేపతో పోటీ పడే చురుకుదనం ఆయనది. ఏ రంగంలోనైనా తనదైన ముద్ర వేయాల్సిందే. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రశంసలు అందుకుంటున్న కళా తపస్వి కొండారెడ్డి.



(ప్రొద్దుటూరు అర్బన్, ఆంధ్రజ్యోతి)

స్థానిక రామేశ్వరంలోని మిట్టమడి వీధి వాసి ఎస్ఆర్ కొండారెడ్డి చాపాడు మండలం పెద్దచియ్యపాడు వాసులు శివపురెడ్డి రామిరెడ్డి, లక్ష్మమ్మ గార్ల 5వ సంతానం. టెన్త్ వరకు గ్రామంలోనే పూర్తి చేశారు. ఐదో తరగతి నుంచే తండ్రికి పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవారు. నంద్యాల జిల్లా చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ చదివారు. స్థానిక ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తిచేశారు. బీఎడ్ చదువు కునేందుకు కాలేజీ ఫీజు కోసం రామాపురంలో విద్యార్థులకు చెక్కభజనలో శిక్షణ ఇస్తూ వచ్చిన డబ్బుతో బీఎడ్ పూర్తిచేశారు.

ఉద్యోగ ప్రస్థానం

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయంతో ఖాజీపేట మండ లం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కంటిన్జెంట్ నిధుల ద్వారా నెల కు రూ. 360 వేత నంతో ఆరేళ్లు పని చేశారు. 1995లో జరిగిన ఉద్యోగ ని యామకాల్లో మొదటి సారిగా మోడంపల్లె పురపాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. అక్కడ స్థలం కొరత ఉండడంతో పాఠశాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చేసేందుకు చాలా కృషి చేశారు. 2007లో పదోన్నతిపై అని బీసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయి సైన్స్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగిస్తూ వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీ సేందుకు ఈయన ఎంతో తాపత్రయపడ్డారు. 2011 బదీలీల్లో భాగంగా డీబీసీఎస్ పాఠశాలకు వచ్చారు. అదే ఆశయంతో వరుసగా నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను పంపారు. పంపిన ప్రతిసారి ఈయన ఆధ్వర్యంలో ప్రదర్శించిన నమూనాలు రాష్ట్ర స్థాయిలో మన్ననలు పొంది బహుమతులు సాధించడం గమనార్హం. 19వ జాతీ య సైన్స్ కాంగ్రెస్‌లో ఈయన ఆధ్వర్యంలోని బృం...దం ఏకంగా జాతీయ స్థాయిలో 'ఎ' లెవల్ ప్రదర్శనగా ఎంపికైంది. ఫిబ్రవరి 28న సైన్స్‌డే పురస్కరించుకుని విద్యార్థులు కూడా రూ. 25 వేల పారితోషికాన్ని అందుకున్నారు. జిల్లా నుంచి జాతీయ స్థాయికి విద్యార్థులు వెళుతున్నారంటే అక్కడ ఎస్ఆర్ కొండారెడ్డి కృషి ఉంటుందనేలా తనదైన శైలిలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

అవార్డుల పరంపర

కొండారెడ్డి ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలకు 22 అవార్డులు, 50కు పైగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఎన్‌సీ ఎస్‌సీ ద్వారా 12, సైన్స్ ఫెయిర్ ద్వారా 3, ఇన్ స్పైర్ ద్వారా 3, ఏపీ సైన్స్ కాంగ్రెస్ ద్వారా 3, సదరన్ ద్వారా 1 అవార్డులు రావడంతో రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. చెక్కభజన కళా కారుడిగా ఇద్దరు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. 2024 నవంబరు 11న డాక్టర్ మౌలాన అబుల్ కలాం ఆజాద్ జన్మదినం రోజున మంత్రులు నారాలోకేష్, సత్యకుమార్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సమక్షంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును అందుకున్నారు. ఏ పోటీల్లో అడుగు పెట్టినా బహుమతి వరించాల్సిందే...



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డు అందుకుంటున్న కొండారెడ్డి

చైతన్య కళాకారుడు..

కొండారెడ్డి ఏడో తరగతి చదువుతుండగానే చెక్కభజనలో ప్రావీణ్యులుగా పేరున్న తన అన్నను గురువుగా, అతన్ని స్ఫూర్తిగా తీసుకుని చెక్కభజన నేర్చుకున్నారు. కోలాటంలో ఆసక్తి పెంచుకుని ఆ కళపై కూడా పట్టుసాధించారు. అప్పటి నుంచి ఒక బ్యాచ్ ఏర్పాటు చేసుకుని చెక్కభజనలు, కోలాటం ప్రదర్శనలు ఇస్తూ వస్తున్నారు. వీరి ప్రదర్శనలకు మంచి గుర్తింపు రావడంతో సమాచార శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జరిగే ప్రభుత్వ పథకాల ప్రచారంలో భాగంగా కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అక్షరరశ్మి, నీరు-మీరు, వనమహోత్సవాలు, జన్మభూమి, ఎయిడ్స్ లాంటి కార్యక్రమాల్లో చైతన్యవంతుల్ని చేసే దిశగా చెక్కభజనలు, పాటలు పాడుతూ పథకాల ఉద్దేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేవారు. ఇందు కోసం స్వయంగా కొండారెడ్డి పాటలు రచించేవారు. ఈయన ప్రతిభకు మెచ్చి అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 6వ మహనాడులో ప్రథమ శ్రేణి ప్రశంశా పత్రం, జ్ఞాపికను అందజేశారు.



చెక్కభజనలో శిష్యబృందంతో కొండారెడ్డి (ఫైల్‌ఫొటో)

- 1992లో అక్షరరశ్మి కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.
- 1992లో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 1987లో కడప జిల్లాలో చెక్కభజన ప్రదర్శనకు ప్రశంశలు లభించాయి.
- 1989లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లాలో జరిగిన చెక్కభజనకు అప్పటి కలెక్టర్ నుంచి బహుమతులు అందుకున్నారు.
- 2011 నుంచి విద్యార్థులకు చెక్కభజన, కోలాటంలో శిక్షణ ఇస్తూ పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థులతో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు.

ఈతలోనూ దిట్ట..

కడప ద్విశతాబ్ధి ఉత్సవాల్లో ఈత పోటీల్లో పాల్గొన్న కొండారెడ్డి రెండు విభాగాల్లో బహుమతులు గెలుచుకున్నారు. బెస్ట్ స్ట్రోక్‌లో ప్రథమ బహుమతిగా స్వర్ణ పతకాన్ని సాధించారు. ఇక ఫ్రీ స్టైల్ విభాగంలో ద్వితీయ బహుమతితో రాణించారు. అటు విద్యార్థుల్ని తీర్చిదిద్దుతూ ఇటు ప్రజల్లో సామాజిక చైతన్యం కలిగిస్తూ కొండారెడ్డి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

గడ్డి మందు పిచికారీతో ఎండిన పెరటి చెట్లు

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



పూర్తిగా ఎండిన నిమ్మ చెట్టు

కాయలు సైతం ఎండిపోయిన మునగ చెట్టు

రైల్వేకోడూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బయనపల్లె వాసి కస్తూరి ఈశ్వరయ్య ఇంటి పెరటి చెట్లకు గడ్డి మందు పిచికారీ చేయడంతో చెట్లు చనిపోయాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... ఈశ్వరయ్య ఇంటి పెరట్లో పలు రకాల మొక్కలు నాటారు. ఇంటి ఆవరణలో నిమ్మ, మునగ, జామ, కరివేపాకు, చిక్కుడు, తమలపాకు పెంచుకుంటున్నాడు. అయితే మునగ చెట్టుకు గొంగళి పురుగు చీడ పట్టింది. కాగా ఇదే గ్రామస్తుడు గణేష్ ఈశ్వరయ్య ఇంటి ఆవరణలో ఉన్న మునగ చెట్టుకు పట్టిన చీడ ద్వారా తమ పిల్లలకు రోగాలు వస్తున్నాయని నెల 17న ఈశ్వరయ్య కుటుంబ సభ్యులతో గణేశ్ గొడవ పడ్డాడు. అదే రోజు గణేష్ మునగ చెట్టుపై గడ్డి మందును పిచికారీ చేయడంతో మునగ చెట్టు, నిమ్మ చెట్టు చనిపోయాయి. ఫలితంగా రెండు ఇళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. తరచూ గొడవలు పడుతుంటారు. గ్రామంలో ఏదైనా గొడవలు వస్తే సాధ్యమైనంత వరకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లరు. ఊరి పెద్దలే పరిష్కరిస్తారు. అయితే ఈ వివాదాన్ని వారు సైతం పరిష్కరించలేక పోవడంతో పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు ఇరు వర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వినకపోవడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు.

ఇక్కడ నిధి, నిక్షేపాలు లేవు

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన


- కలెక్టర్ ఆదేశాలతో బోర్డు నాటిన అధికారులు



బోర్డు నాటుతున్న రెవెన్యూ, ఫారెస్టు అధికారులు


సుండుపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శేషాచలంలో ప్రాచీన మానవ జీవనానికి సాక్ష్యాలుగా బృహత్ శిలాయుగం నాటి సమాధులు ఉన్నట్లు ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దట్టమైన అడవి మధ్యన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో 50 సమాధులు ఉన్నాయి. అవి కేవలం సమాధులు, ఆదిమానవుల జీవనానికి సాక్ష్యాలు మాత్రమే. ఇక్కడ ఎటువంటి నిధి నిక్షేపాలు లేవని సుండుపల్లె తహసీల్దార్ దైవాదీనం ప్రకటించారు. ఇక్కడ ఉన్న సమాధులు, బండలతో నిర్మించిన గూళ్లను ఎవరూ కూల్చకూడదని ఆదేశించారు. ఎవరైనా ఆ సమాధులు ఉండే ప్రదేశానికి వెళ్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాయవరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అంజనాస్వాతి ప్రకటించారు. అక్కడ నిర్మాణాల్లో బండలపై నాటి అపురూపమైన చిత్రాలున్నాయి. వాటిని కూల్చరాదన్నారు. గుప్త నిధులు లాంటి నిక్షేపాలు ఉన్నాయని, ఎవరైనా వాటిని కూలిస్తే అటవీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ ఎటువంటి నిధులు లేవు. అజ్ఞాత వ్యక్తులకు ప్రవేశం లేదని బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్ఓ పవన్‌కల్యాణ్‌నాయక్, వీఆర్‌ఏ శంకరయ్య, రెవెన్యూ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్యాయత్నం



ములకలచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ములకలచెరువు సరిహద్దులోని తనకల్లు మండలం బింతలపల్లె రైతు శ్రీనివాసులు(45) పంట సాగు కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష ద్రావణం తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు. మదనపల్లె ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు సమాచారాన్ని తనకల్లు పోలీసులకు బదిలీ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు పెద్దివీడు విద్యార్థి



వీరబల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అండర్-14 రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడల్లో పెద్దివీడు రెడివారిపల్లె హైస్కూల్ విద్యార్థి రాజేశ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మధుసూదన్‌రాజు తెలిపారు. చిత్తూరు జిల్లా తవణంపల్లి జడ్పీ హైస్కూల్‌లో 22 నుంచి 24 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇందులో జాతీయ పోటీలకు ఎంపికైన బాలుడు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అనంతరం కళాశాల సిబ్బంది రాజేశ్‌ను అభినందించారు. పీడీ రవీంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ

మున్సిపాలిటీలో టెండర్లు , పనుల నాణ్యతపై దర్యాప్తు ● నేడో రేపో విచారణ కమిషన్ రాక ● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫిర్యాదుతో సీఎంఓ ఆదేశాలు

ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల అక్రమాలపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమైంది. నేడో రేపో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి విచారణ కమిషన్ రానుందని విశ్వసనీయ సమాచారం. మున్సిపాలిటీలో జరిగిన కోట్ల రూపాయల వైసీపీ అక్రమాలపై 2024 జూలై 8న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. 2024 ఆగస్టు 14న మున్సిపల్ అడ్మిస్ట్రేషన్‌అండ్‌అర్బన్‌డెవలెప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆయన ఎమ్మెల్యే వరద ఫిర్యాదుపై విచారణ చేపట్టమని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించారు. దీంతో డీఎంఏ అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో వేసిన విచారణ కమిషన్ నేడో రేపో ప్రొద్దుటూరుకు రానుంది. వివరాల్లోకెళితే...

వైసీపీడ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కాంట్రాక్టర్లు ఎవరూ స్వేచ్ఛగా టెండర్లు వేయడానికి వీలు లేకుండాపోయిందని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా సింగల్ టెంటర్లకు వైసీపీ నేతల వత్తిళ్లకు అధికారులు అనుమతించడం, ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసుకుని మున్సిపాలిటీ ఆదాయానికి గండికొట్టారని ఎమ్మెల్యే వరద అభియోగం. అంతేకాకుండా ఒకే పనిని నాలుగుగా విభజించి నిబంధనలు ఉల్లఘిచారనే ఆరోపణలున్నాయి. రెండు కోట్ల రూపాయల పనిని విభజించి రూ.40 లక్షల లోపు పనులుగా మార్చి మున్సిపల్ ఈఈ స్థాయిలోనే ఆమోదం తీసుకుని ఎస్ఈ వరకు వెళ్లకుండా పనులు చేపట్టారని ఆరోపణలున్నాయి. ముఖ్యంగా మున్సిపల్ పార్కు అభివృద్ధి, మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. అంతేకాకుండా ఎర్రగుంట్ల రోడ్డు విస్తరణ పనులు నాసిరకంగా జరిగాయని ఆరోపణలున్నాయి. గాంధీరోడ్డు రామేశ్వరం రోడ్డు శివాలయం వీధి మైదుకూరు, ఎర్రగుంట్ల రోడ్డుల్లో డివైడర్ల నిర్మాణ పనులపై కూడా విచారించాలని ఎమ్మెల్యే కోరారు. తాత్కాలిక మున్సిపల్ కూరగాయల మార్కెట్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వ్యాపారులతో పెద్ద నిర్మాణానికి అరుగుల ఏర్పాటుకు డబ్బు వసూళ్లు చేసి మున్సిపల్ నిధులతో తాత్కాలిక కూరగాయల మార్కెట్ నిర్మాణం జరిగిందని ఆరోపించారు. వైసీపీ పాలనలో దాదాపు 1000 నుంచి 1200 వర్కులు జరిగాయని 100కోట్లకు పైగా నిధులు ఖర్చుచేశారని ఇందులో వైసీపీ నేతలు టెండర్లలో అక్రమాలకు పాల్పడి పనులు దక్కించుకుని మున్సిపల్ ఆదాయినికి గండి కొట్టారని ఆరోపించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారుల సర్టిఫికెట్ లేకున్నా కొన్ని పనులకు బిల్లులు చేశారని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ స్థాయి అధికారి వైసీపీ నేతల అండతో పట్టణంలో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, దాదాపు 200 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఇందులో కోట్ల రూపాయలు టౌన్ ప్లానింగ్ అధికారి సహా వైసీపీ ప్రజాప్రతినిధి పంచుకున్నారని ఆరోపణలున్నాయి. కొన్ని మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, వీటన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరిపి అక్రమ కట్టడాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఫైళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది

రెండు రోజుల్లో విచారణ కమిషన్ రానుండడంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఐదేళ్లలో జరిగిన దాదాపు 1000 పనులకు సంబంధిత అన్ని రకాల ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ నాగరాజు, టీపీఓ చంద్రమోహన్ అక్రమ కట్టడాల నిర్మాణాలు, అనుమతులపై ఫైళ్లు సిద్ధం చేస్తున్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి

వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలు చెప్పిన పనులు నిబంధనలకు విరుద్ధంగా చేసి వుండడంతో కొందరు ఇంజనీరింగ్ అధికారుల్లో అలజడి మొదలైంది. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమాలుచ అవినీతికి పాల్పడ్డట్లు ఆరోపణలున్నా ఏసీపీ అధికారి కడప కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన కమిషనర్లకు సైతం కొంత సమస్యలు తప్పదని భావిస్తున్నారు.

రైతులకు మైక్రో ఇరిగేషన్ ఒక వరం

90 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ● జిల్లా వ్యాప్తంగా 30,950 హెక్టార్లు సాగు లక్ష్యం ● జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న





శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మనీటి సాగు అదికారి లక్ష్మీప్రసన్న

రాయచోటిటౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులకు మైక్రో ఇరిగేన్ ఒక వరమని జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. శుక్రవారం వీరబల్లి మండలం ఓదివీడు రైతు సేవా కేంద్రంలో రాయచోటి ఉద్యానవనశాఖ డివిజన్ పరిధిలోని వీరబల్లి, టి. సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతు సేవా కేంద్రం సిబ్బంది శిక్షణలో ఆమె మాట్లాడుతూ డ్రిప్ అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ నీటి పరికరాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి 30,950 హెక్టార్లలో డ్రిప్ పరికరాల ద్వారా పంటల సాగు అమలు లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 28,230 హెక్టార్లకు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఇప్పటి వరకు 4,404 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో డ్రిప్ పరికరాలు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది, గ్రామ ఉద్యాన, వ్యవసాయ, సెరికల్చర్ సహాయకులు అందరూ త్వరితగతిన మైక్రో ఇరిగేషన్ కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను సందర్శించి ప్రాథమిక సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ప్రాథమిక సర్వే, అంతిమ తనిఖీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. సంబేపల్లె మండల ఉద్యాన అధికారి వనితాభాయి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, గురుప్రసాద్, కృష్ణానాయక్, వినోద్, సాయికిరన్, కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 సంబంధించి జిల్లాకు రోల్ అబ్జర్వర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు ఐఏఎస్ 30న జిల్లాకు రానున్నారని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఓటరు జాబితా పురోగతిపై పరిశీలించి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. సమావేశానికి ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ ఆఫీసర్సు హాజరు కావాలని, ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుడి అరెస్టు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకోకుండా యువతి మృతికి కారకుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన అంజలి కడప ఓ ఆస్పత్రిలో పనిచేస్తోంది. అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న భానుప్రసాద్, అంజలి ప్రేమించుకున్నారు. భానుప్రసాద్ పెళ్లికి నిరాకరించడంతో ఈనెల 5న ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పండింది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి బంధువుల ఫిర్యాదు మేరకు భానుప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు.

భద్రతకే ప్రథమ ప్రాధాన్యం : డీఆర్‌ఎం

● రైల్వే రన్నింగ్ రూం, క్రూ రూం ప్రారంభం



ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రన్నింగ్ రూంను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

ఎర్రగుంట్ల, నవంబరు 29: రైల్వేలో భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజినల్ రైల్వే మేనేజర్ ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుంట్లలో ఆయన రైల్వే ఇంజన్ డ్రైవర్స్ విశ్రాంతి (రన్నింగ్) భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ సెమినార్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ఉద్యోగులు మానసిక వత్తిడిని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. ముఖ్యంగా విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. క్షణాల్లో జరిగే ప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు జా గ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా డ్రైవర్లు చాలా సంయమనాన్ని పాటించాలన్నారు. కొందరు కడప, కొండాపురం, గుత్తి ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారని ఇది సరికాదన్నారు. లోకో డ్రైవర్లు, గార్డ్స్, ఇతర సిబ్బందికి భద్ర తపై ఆయన అనేక సూచనలిచ్చారు. ఇటీవల ప్రమాదాలు పెరిగిన మాట వాస్తమేనని, ఇకపై జీరో ప్రమాదాలు ఉండేలా ప్రతి ఉద్యోగి కృషిచేయాలని సీనియర్ డీఈఈ టీఆర్ఎస్ఓ వీరయ్య ఉద్యోగులకు సూచించారు. కాగా.. ఎర్రగుంట్లలో రైల్వే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని టెండర్ పిలిచినా ఇప్పటికీ ప్రారంభించలేదని డీఆర్‌ఎం దృష్టికి తీసుకురాగా డిజైన్ పూర్తయిందని పదిరోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ విస్తరణ పనులు అతిత్వరలో జరుగుతాయని అప్పుడు లిఫ్ట్, ఎక్స్‌లేటర్ కూడా వస్తాయని సీనియర్ డీఈఈ టీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 29: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ఆయన ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)హాలులో రెవెన్యూ సంబంధిత అంశాలపై కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ నైదియాదేవి, రెవెన్యూ అధికారులతో మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా రీసర్వే, వెబ్‌ల్యాండ్ కరెక్షన్స్ ఆధార్ కరెక్షన్స్, మ్యుటేషన్లకు సంబంధించి ప్రజలు వస్తుంటారని, తహసీల్దార్లు వీఆర్ఓలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి వారి సమస్యను పరిష్కరించాలన్నారు.

కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, ఏడీ సర్వే భరత్‌కుమార్, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీ ల్దార్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్ల చేలల్లో... రతనాల పైర్లు

ఆ రెండు గ్రామాల రైతులకు రాళ్ల చేలు వరంలా మారాయి. మండలం నుంచి 13 కి.మీ దూరంలో చెన్నుపల్లె, గోపవరం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడకు సమీ పంలో పులివాగు.. ఆ పక్కన రాచ్చెరువు.. సింగరాయకొండ ఉన్నాయి. ఈ ప్రాంతంలో చిన్నపాటి రాళ్లతో కూడిన పొలం ఉంది. ఈ పొలంలో ఆ రెండు గ్రామాల రైతులు ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తూ.. సిరులు కురిపిస్తున్నాయి.


చెన్నుపల్లె పంచాయతీలో ఉన్న రాళ్లభూమి

● చెన్నుపల్లె, గోపవరం గ్రామాల రైతులకు వరంలా.. రాళ్ల పొలాలు ● ఏ పంట సాగు చేసినా... సిరులు కురిపిస్తున్న వైనం

కలసపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలసపాడు మండలంలోని చెన్నుపల్లె, గోపవరం గ్రామాలకు సంబంధించి పులివాగు.. సింగరాయకొండ ప్రాంతంలో 250 ఎకరాల రాళ్ల పొలం ఉంది. మరో పక్క రాచ్చెరువు ప్రాంతం ఉండటంతో రైతులంతా ఆ రాళ్లలోనే పైర్లు సాగు చేయడం మొదలు పెట్టారు. ఖరీఫ్ సీజన్‌లో సజ్జ, మినుము, కంది పైర్లు సాగు చేస్తారు. ఒక్కసారి వర్షం పడితే చాలు.. వెంటనే ట్రాక్టర్లతో విత్తనాలు చల్లి బండ రాళ్లను కలియదిప్పుతారు. రాళ్ల కింద పడిన విత్తనం ఆ తర్వాత వర్షం లేకపోయినా బెట్ట తటుకుని ఏపుగా పెరిగి అత్యధిక దిగుబడి వస్తుంది. ఇటీవల కొందరు రైతులు కూరగాయల పంటలు సాగు చేసి మంచదిగుబడులు సాధిస్తున్నారు. మిరప, టమోటా పైర్లకు కొద్దిపాటి నీటిని అందిస్తూ వేసవిలో కూడా పైర్లు పండిస్తున్నారు.


రాళ్ల భూమిలో సాగైన సజ్జపంట

సాగు ఖర్చులు తక్కువే..



రాళ్లపైరులో సాగు ఖర్చులు తక్కువగానే ఉంటాయి. వర్షాలు పడినప్పుడు విత్తనాలు వేస్తే కలుపు మొక్కలు రావు. దీంతో కలుపు తీయడం కానీ, నివారణ మందు పిచికారి చేయడం కానీ చేయాల్సిన పని ఉండదు. దీంతో సాగు ఖర్చులు ఎకరాకు 5 నుంచి 10వేల రూపాయలు తగ్గుతున్నాయి.

- ప్రసాద్, రైతు, చెన్నుపల్లె

రాళ్లను తీసివేస్తే దిగుబడి సున్నా

గతంలో కొందరు రైతులు రాళ్లను తొలగించి పైర్లను సాగు చేసేందుకు ప్రయత్నించారు. అయితే వారు విత్తనం వేసినా అది మొలక దశ నుంచి ఏ మాత్రం ఎదుగుదల లేక పైరు దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని తెలుసుకున్న రైతులు తిరిగి తొలగించిన చిన్నపాటి బండరాళ్లను మళ్లీ పొలాల్లో తోలారు.

వాతావరణ పరిస్థితే కారణం

రాళ్ల కింద పడిన విత్తనం కింద ఏ మాత్రం తడి ఆరకండా చేస్తుంది. అంతేకాక ఎంత వర్షం పడినా మొక్కకు ఎక్కువ నీరు అందదు. అంతేకాకుండా బెట్ట పరిస్థితుల్లో రాత్రిపూట రాళ్లు చల్లగా మారి మొక్కకు తేమనందిస్తాయి. దీంతో ఏ పంట సాగు చేసినా మంచి దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు.

అధిక దిగుబడులు వస్తున్నాయి



రాళ్లపొలాల్లో అధిక దిగుబడులు వస్తున్నాయి. ఎటువంటి నీటి పారుదల లేకున్నా కేవలం మంచుతోనే మంచి పంటలు పండుతున్నాయి. ఎటువంటి పై పాటి ఎరువులు వేయడం లేదు. దీంతో ఖర్చు తగ్గడమే కాకుండా మంచి లాభాలు కూడా వస్తున్నాయి.

-నాగేష్, గోపవరంపల్లె

బ్లాక్‌మెయిల్ చేసి వివాహమాడి..

● విడిపోయేందుకు డబ్బులు డిమాండ్
● ఇవ్వకపోతే కేసు పెడతామంటూ బెదిరింపులు
● న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు


బాధితుడు మస్తాన్‌వలి

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప రవీంద్రనగర్‌కు చెందిన షేక్ ఉమ్మే సల్మా అనే మహిళ తనను బ్లాక్‌మెయిల్ చేసి వివాహం చేసుకుని... లక్షల్లో డబ్బులను దండుకోవడమే కాక, అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే కేసు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరిస్తోందని బాధితుడు షేక్ మస్తాన్‌వలి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మస్తాన్‌వలి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కడప నగరంలోని ఓ ట్రావెల్స్ డ్రైవరుగా తాను పనిచేస్తున్నానన్నారు. ఆ సమయంలో ఉమ్మే సల్మా తనకు పరిచయమైందని.. గతంలో వివాహమైందని, భర్తను వదిలేశానని మాయమాటలు చెప్పిందన్నారు. తరువాత కొన్ని రోజులకు సల్మాతో పాటు ఆమె చెల్లెలు, చెల్లెలు భర్తతో కలిసి బెదిరించి తనతో వివాహం చేశారన్నారు. ఆ తర్వాత తన నుంచి విడిపోయేందుకు అగ్రిమెంటు రాయించుకుని విడతల వారీగా రూ.లక్షల్లో డబ్బులను దండుకున్నారన్నారు. ఆమె గురించి తరువాత విచారించగా.. తనకు పరిచయం కాక ముందు షేక్ అజ్మతుల్లాతో వివాహమై విడిపోయిందన్నారు. తరువాత షేక్ కరీముల్లా, గౌస్, ఆటోడ్రైవరు శివలను వివాహం చేసుకుని వారిని బ్లాక్‌మెయిల్ చేసి అందినకాడికి డబ్బులను దండుకుందని ఆరోపించారు. ఆమె చెల్లెలు భర్త సాదిక్ ఇటీవల కడప తాలుకా పరిధిలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, తాను డబ్బులు ఇవ్వకపోతే అతని చేత హత్య చేయిస్తామంటూ బెదిరిస్తున్నారన్నారు. ఉమ్మే సల్మా, ఆమె బంధువుల నుంచి ప్రాణహాని ఉందని.. తనకు రక్షించి న్యాయం చేయాలని మస్తాన్‌వలి వేడుకున్నారు.

ఉద్వేగాల నియంత్రణతో ఆరోగ్యకర జీవితం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌చాన్సలర్ తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన జీవితం ఉద్వేగాల నియంత్రణ ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని విజయవాడ ఇన్‌లాస్ హాస్పిటల్ డైరెక్టరు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. వైవీయూ, ప్రధానమంత్రి ఉచ్ఛతార్ శిక్షణ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల పని, జీవిత నిలకడ, మానసిక సమ స్యలు అనే అంశంపై ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సానుకూల ఆలోచనలతో ఒత్తిడి దూరం చేయవచ్చన్నారు. సంతోషాన్నిచ్చే విషయాలను గుర్తించుకుని.. దుఃఖం విషయాలు దూరంగా ఉంచాలన్నారు. అనంతరం అధ్యాపకులు అడిగిన మానసిక సమస్యలపై సందేహాలను నివృత్తి చేశారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వైవీయూ అధ్యాపకులకు ఉపయోగపడే మంచి కార్యక్రమా న్ని సమన్వయం చేసిన చంద్రశేఖర్‌ను అభినందించారు. రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి ప్రణాళికబద్ధమైన జీవితం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు క్రిష్ణారావులు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని 54 కేంద్రాల్లో 1,3,5 సెమిస్టర్లకు సంబంధించి 20819 విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. హైపవర్ కమిటీ అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

2న ఉమ్మడి జిల్లా జూనియర్ బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డిసెంబరు 2వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు ఉమ్మడి కడప జిల్లా జూనియర్ బాల, బాలికల కబడ్డీ ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ. రవీంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జేవీ సుబ్బన్న తెలిపారు. 20 సంవత్సరాలలోపు గల ఔత్సాహిక, అర్హత గల బాల బాలికలు ఎంపికలకు హాజరు కావాలన్నారు. బాలురు 70 కేజీలలోపు, బాలికలు 65 కేజీలలోపు బరువు వుండాలన్నారు. ఇతర వివరాలకు 9133480661 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కోసం ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ సూచనల మేరకు 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 3గంటలకు డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో విజేతలైన ముగ్గురు మహిళలకు ప్రైజ్‌మనీ కింద మొదటి బహుమతి రూ.1,111లు, రెండో బహుమతి రూ.777లు, మూడో బహుమతి రూ.555లు అందజేస్తామని తెలిపారు. పోటీల్లో మహిళలు ముగ్గు పొడి, రంగులు తెచ్చుకోవాలని, పాల్గొన్న వారందరికి సర్టిఫికెట్లు అందజేస్తామని రవిబాబు ప్రకటనలో పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష విరాళం

చక్రాయపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి దాతలు ఆన్‌లైన్ ద్వారా లక్ష రూపాయలు విరాళం పంపించినట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెన్నైకి చెందిన సముద్రాల భానుప్రసాద్, ధర్మపత్ని వందన, కుటుంబ సభ్యులు ఆన్‌లైన్ ద్వారా పంపించారన్నారు. వీరికి స్వామివారి తీర్థప్రసాదాలు, అన్నదాన విరాళ రసీదు పంపడం జరుగుతుందన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ...కేసు


ఘర్షణలో గాయపడిన వీరనారాయణరెడ్డి, రవిశంకర్

కమలాపురం రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పారావుపల్లెలో గురువారం రాత్రి ఇరువర్గాల వారు ఘర్షణలకు పాల్పడగా పలువురికి గాయాలైనట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... అప్పారావుపల్లెలో ఒక వర్గా నికి చెందిన రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ఎల్లారెడ్డిలు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డి తదితరులు పాతకక్షల కారణంగా ఘర్షణ పడ్డారు. దీంతో రవిశంకర్‌తో పాటు మరో వర్గంలోని వీరనారాయణరెడ్డికి రక్తగాయాలయ్యాయి. వీరిని కమలాపురం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించామన్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరు గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక బేల్దారి ఆత్మహత్య



ప్రొద్దుటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రొద్దుటూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డుకు చెందిన అంకగాళ్ల నాగేంద్ర(24) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అనారోగ్యంతో పాటు అప్పుల బాధ తాళలేక శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలి


మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

పులివెందుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులకు చేరవేయాలని ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మినీసెక్రటేరియట్‌లోని ఉద్యానశాఖ కార్యాలయంలో పులివెందుల వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రరెడ్డిల ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర సహాయకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఐదు ఎకరాల లోపు కలిగిన రైతులకు 90శాతం రాయితీతో రూ.2.18 లక్షల వరకు, 5 నుంచి 10 ఎకరాల్లోపు గల రైతులకు 70శాతం రాయితీతో రూ.3.46 లక్షల వరకు డ్రిప్ పరికరాలను అందజేస్తారన్నారు. 55శాతం మరియు 45శాతం సబ్సిడీలతో స్ప్రింక్లర్‌లు మంజూరు చేస్తామని.. ఈ విషయాన్ని రైతులకు చేరవేయాలన్నారు. ఏడీఏ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రబీలో పంటలు సాగుచేసిన రైతులందరు క్రాప్ బుకింగ్ చేసుకోవాలని తెలియజేయాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల వారీగా నిర్దేశించిన డ్రిప్, తుంపర సేద్యాల లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. లింగాల ఏఓ రమేష్, పులివెందుల ఏఓ నాగలక్ష్మి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయండి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


బలిజల ఆత్మీయ సమావేశం గురించి వివరిస్తున్న హరిప్రసాద్ తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మేడా కన్వెన్షన్‌లో డిసెంబరు 22న నిర్వహిస్తున్న బలి జ, కాపు, తెలగ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం కడప నగరం హరిటవర్స్‌లో బలిజ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 23శాతం మంది బలిజలు ఉన్నా.. బలిజలకు తగిన ప్రాధాన్యత లేదన్నారు. ఈనేపథ్యంలో కూటమి పార్టీలో గెలిచిన ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, చైర్మన్లకు సన్మానం, ఆత్మీయ సమావేశ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఎవరి స్వార్థం కోసం నిర్వహించడంలేదని, కేవలం బలిజల సమస్యల పరిష్కారానికి, హామీలు పొందడానికి నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని బలిజ సంఘాలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బలిజ నాయకులు బండిబాబు, మునెయ్య, రావు, చలపతి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులకు ఫైర్ ఎన్‌ఓసీ తప్పని సరి

● డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్

కడప కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేట్ ఆసు పత్రుల యాజమాన్యాలు ప్రమాదాల నివారణకు అగ్నిమాపకశాఖ నుంచి ఎన్‌వోసీ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల వలన రోగుల ప్రాణాలు అపాయంలో పడకుండా 2022లో గెజిట్ జారీ చేయడం జరి గిందన్నారు. ఎక్కువ పడకలు కలిగిన ఆసుపత్రుల యాజమాన్యాలు గతంలో జారీ చేసిన ఎన్‌వోసీలను రెన్యువల్ చేసుకోవాలని, కొత్తగా అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీని తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్‌వోసీ లేని వారు ఆసుపత్రులను నిర్వహించరాదని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు

దోమల నివారణ అందరి బాధ్యత

దోమల కుట్టడం వలన మలేరియా, డెంగీ, గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, దోమల నివారణ అందరి బాధ్యతగా భావించాలని కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ అన్నారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నగరంలోని చిన్నచౌకు, అన్నారెడ్డి వీధుల్లో జరిగింది. దోమల వలన వ్యాపించే విషజ్వరాలపై, నియంత్రకు తీసుకోవాల్సిన చర్యలపై ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్యాధికారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ మలేరియా అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో దోమ తెరలను వాడాలన్నారు. కాలనీల్లో ముళ్ల పొదలు లేకుండా చేసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా ఇళ్లలోని పాత్రలన్నిటిని శుభ్రంగా ఉంచకోవాలన్నారు. పరిసరాల్లో ముళ్ల పొద ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మి రెడ్డి, ఎంపీఈహెచ్ఈవో నిత్య పూజయ్య, ఏఎన్ఎ సరస్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


బెల్టుషాపులు, సారా విక్రయాలపై కేసులు

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు


గుర్రంగుంపు తాండాలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపులు, నాటుసారా విక్రయాలు, తయారీ చేస్తున్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షిస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ హెచ్చరించారు. చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు తాండలో శుక్రవారం గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గతంలో చుట్టుపక్కల నాటుసారా తయారు చేసేవారని, ఇప్పుడు కూడా అలా కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించకూడదని, ఎవరైనా నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి, సారా లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనరు చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంటు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, కడప ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష గాజుల అలంకారంలో భద్రకాళీ అమ్మవారు



రాయచోటిటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా స్థానిక వీరభద్రాలయంలో భద్రకాళీ అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, రాహుకాల పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో బీవీ రమణారెడ్డి, అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు కొంతేనా?

● బి.కొత్తకోటలో చిన్నపాటి తొలగింపులు ● అనామకులను ఖాళీచేయించి..సంపన్నులను వదిలేశారా? ● ఆర్‌అండ్‌బీ ఆక్రమణలు ఎలా?


బి.కొత్తకోట జ్యోతి సర్కిల్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం(ఫైల్‌ఫొటో)


బి.కొత్తకోటలో ఇరుకైన మదనపల్లె రోడ్డులో 30 అడుగులు కూడా లేని ప్రాంతం

బి.కొత్తకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీలో ఏళ్ల తరబడి నాటుకుపోయిన కబ్జాలను కొంత వరకు తొలగించిన సంపన్నులు నివసించే ప్రాంతాలను వదలివేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరపంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి పట్టణంలో ఆక్రమణల తొలగింపును సవాలుగా స్వీకరించి తొలగింపు కార్యక్రమానికి నూతన ఒరవడిని సృష్టించారు. ముఖ్యంగా జ్యోతిచౌక్, బెంగళూరు రోడ్డు సర్కిల్‌లలో ఆక్రమణలను తొలగించి నగరపంచాయతీ స్థలాన్ని, ప్రభుత్వ కట్టడాలకు విముక్తి కల్పించారు. ఈ క్రమంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకువెళ్లారు. ఈ చర్యలలో పలువురు చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయారు. పట్టణంలోని రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, పీటీయం రోడ్డులలో డ్రైనేజి వరకు ఆక్రమణలను నిర్మొహమాటంగా తొలగించారు. దీనిపై క్రమంగా పలువురు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన రోడ్లను రెవెన్యూశాఖ అప్పగించిన మేరకు రోడ్లు భవనాల శాఖ స్థలాన్ని తమ ఆధీనంలో ఉంచుకోలేదని, ముఖ్యంగా పట్టణ నడిబొడ్డున వెళ్లే మదనపల్లె రోడ్డు రెవెన్యూ స్కెచ్ మేరకు 60 అడుగులకు పైగా ఉండాలని ప్రస్తుతం అది 30 అడుగులు కూడా లేదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో శ్రీమంతులు, బడావ్యాపారులు కాబట్టి తగు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలువస్తున్నాయి. అదే విధంగా రంగసముద్రంరోడ్డు, బెంగళూరు రోడ్డులో 100 అడుగులకు పైగా ఉండాలని దీనిపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై త్వరలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు స్థానికులు కొందరు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

ఆర్ అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురైంది వాస్తవమే

బి.కొత్తకోట పట్టణంలో ఆక్రమణల తొలగింపు విషయమై తహశీల్దార్ మహమ్మద్ అన్సారీని వివరణ కోరగా పూర్వం రోడ్లుభవనాల శాఖకు స్థలాన్ని కేటాయించగా ఇప్పుడు ఆ స్థలం అన్యాక్రాంతం అయిందన్నారు. తిరిగి ఆ స్థలం స్వాధీనం చేసుకోవడంలో ఆ శాఖావారు సహకరించాలని కోరితే తాము స్పందిస్తామన్నారు. ఇదిలాచ ఉండగా ఆర్‌అండ్‌బీ అధికా రులు త్వరలో రంగంలోకి దిగి ఆక్రమణల స్థలాన్ని స్వాధీనం చేసుకునే అవకావం ఉందని నగరపంచాయతీ అధికారులు పేర్కొం టున్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన బీజేపీ నేత ఎన్.సేతు


జిల్లా ఎస్పీని కలిసి జ్ఞాపికను అందిస్తున్న బీజేపీ నేత సేతు

మదనపల్లె అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి):అన్నమయ్యజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో బీజేపీ నేత డాక్టర్ ఎన్.సేతు మర్యాద పూర్వకంగా కలిశారు. మదనపల్లెకు చెందిన విజయభారతి హైస్కూల్ డైరెక్టర్, మదనపల్లె బీజేపీ నేత డాక్టర్ సేతు తన స్నేహితులతో కలిసి జిల్లాలోని రాయచోటి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లి ఎస్పీ విద్యాసాగర్‌ను కలిసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం దుశ్శాలువను కప్పి సన్మానించారు.

షరీఫ్‌ను కలిసిన టీడీపీ నేత పర్వీన్‌తాజ్



పెద్దమండ్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వంలో నూతనంగా నియమితులైన రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ అడ్వైజర్ ఎంఏ అహ్మద్ షరీఫ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడ లోని సచివాలయంలో కలిసి మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం పురోగతి పై చర్చించినట్లు తెలిపారు. కూటమి నేతలు ఇస్మాయిల్(చింటు) కిట్టన్న, జావీద్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంతో కడప అమీన్ పీర్ దర్గా బృందం

కలికిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప అమీన్ పీర్ దర్గా మేనేజిమెంట్ బృందం శుక్రవారం మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని కలిశారు. దర్గా మేనేజరు మహమ్మద్ ఆలీ ఖాన్ ఇతర కమిటీ సభ్యులతో కలిసి కలికిరిలో కిరణ్‌కుమార్ రెడ్డితో సమావేశమయ్యారు. అంతకు ముందు కిరణ్‌కుమార్ రెడ్డిని శాలువాలతో సన్మానించారు. మసీదును సందర్శించాలని ఆహ్వానించారు. వీలు చూసుకుని తొందరలో మసీదు సందర్శిస్తానని కిరణ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాకీ ఉల్లా ఖాన్, ఖదీర్, బషీర్, జాకీర్ హుస్సేన్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మెడికల్ కళాశాల ఏవో మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మెడికల్ కళాశాల ఏవోగా పనిచేస్తున్న పల్లంరాజు(56)మృతి చెందినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శివరాం తెలిపారు. గురువారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన ఆయనకు గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతిచెందాడన్నారు.. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాయచోటి నుంచి ఆయన మదనపల్లె మెడికల్ కళాశాలకు బదిలీపై వచ్చారని ఆయన స్వగ్రామం సంబేపల్లె అని ఆయనకు భార్య రాజ్యలక్ష్మీ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి


సమావేశంలో మాట్లాడుతున్న రిసోర్సుపర్సన్ కె.జోహరి

కురబలకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపు ణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉపాధి అవకాశాలను పొందవ చ్చని రీసోర్సుపర్సన్ 4కార్ప్స్ వ్యవస్థాపకుడు, సీఈవో కె. జోహరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్స్ ఇంజనీరిం గ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో లైవ్ హ్యాకింగ్ ఇన్ యాక్షన్ సైబర్ టెక్నాలజీ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీపై దృష్టి సారించి డేటా చోరీకి గురికాకుండా విద్యార్థులు కొత్త టెక్నాలజీలపై పరిశోధన లు చేపట్టి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో గంగాదేవీ, కార్తీక్‌రామ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాలల మహాగర్జనను జయప్రదం చేయాలి

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గుంటూరులో డిసెంబరు 15న తలపెట్టిన 'మాలల మహాగర్జన' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీలేరులోని మాలమహానాడు ఐక్యవేదిక నాయకులు విజ్ఞప్తి చేశారు. మహాగర్జన ప్రచార కరపత్రాలు, వాల్‌పోస్టర్లను శుక్రవారం వారు పీలేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ మాట్లాడుతూ మాలలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు మల్లిఖార్జున, రామాంజులు, వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ జయరామచంద్రయ్య, మోహన్ బాబు, రమణ, లోకనాథం పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా వేణుగోపాల్‌రెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా రేణుమాకులపల్లె వీఆర్వో డి.వేణుగోపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీఆర్వోల సంఘం మండల ఉపాధ్యక్షుడిగా పి.సలీంబాష, కార్యదర్శిగా పి.సంజీవ్, కోశాధికారిగా ఎం.నాగరాజు, సలహాదారుడిగా షంషాద్, కార్యవర్గ సభ్యులుగా రాజగోపాల్, శ్రీరాములు, వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ..ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తామన్నారు. నూతన కార్యవర్గానికి తహసీల్దారు హరికుమార్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

పెద్దమండ్యం,నవంబరు 29(ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పేర్కొన్నారు. పెద్దమండ్యంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 1 ఆదివారం రావడంతో పింఛన్‌దారులకు ఒక రోజు ముందుగా పింఛన్ పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఆనందదాయకమన్నారు. పింఛన్‌దారులు ఒక నెల పింఛన్ తీసుకోకుంటే రెండు నెలలు కలిపి అందజేయడం విశేషమన్నారు. కూటమి నేతలు రామాంజులునాయుడు, రామంజులు, సాంబ, విశ్వనాథ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌ల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు అవసరం

కురబలకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌ల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ, సీపీఐ కార్యవర్గసభ్యుడు కృష్ణప్పలు కోరారు. శుక్రవారం మండలంలోని అంగళ్లులో ఆటోడ్రైవర్‌లతో సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణా అవసరాలు తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నా యన్నారు. అలాంటి వ్యవస్థకు నష్టం కలిగించేలా ఉన్న 2131 జీవోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. వాహన మిత్ర పథకం కింద రూ.15వేలతో పాటుగా, ఇంటి స్థలాలను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

● స్వామి వారికి దశావతార హారం వితరణ


నరసింహ స్వామివారికి దశావతార హారంను అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని టీటీడీ వేదపండితులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

దశావతార హారం వితరణ

తరిగొండ లక్ష్మీనరసింహస్వామికి దశావతార హారాన్ని హైదరాబాదుకు చెందిన మధుసూదన్‌వర్మ వితరణగా ఇచ్చారు. రూ.73 వేలు విలువ గల హారాన్ని ఆలయాధికారి కృష్ణమూర్తికి అందజేశారు. అర్చకులు ఈ హారాన్ని స్వామి వారికి అలంకరించి ప్రత్యేక పూజలను చేశారు.

ప్రభుత్వ ఐటీఐకి పక్కా భవనం నిర్మించాలి

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పీలేరు ఆయిల్ సీడ్స్‌లో నడుస్తున్న ప్రభుత్వ ఐటీఐకి పక్కా భవనం నిర్మించాలని ఎస్ఎస్‌యూఐ, డీబీఎస్ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పక్కా భవన నిర్మాణం కోసం శుక్రవారం వారు ఐటీఐ విద్యార్థులతో కలిసి కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతతేజ, డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐటీఐ నడుస్తున్న రేకుల షెడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ యూఐ నాయకుడు సాయి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 9 మంది ఉద్యోగాలకు ఎంపిక

మదనపల్లె టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 9 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 30 మంది అభ్యర్థులు పాల్గొనగా వారి ప్రతిభ ఆధారంగా 9 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారన్నారు. వారికి నెలకు రూ.12 నుంచి రూ.19వేల వేతనం అందుతుందన్నారు. జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కలికిరి, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీల సమస్యలను పరిష్క రించడానికి నిరంతరం కృషి చే యాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి సూచించారు. జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా నియమితులైన పాలకుంట శ్రీనివాసులు 'బాస్' ప్రతినిదులతోపాటు శుక్రవారం ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కలకడ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జీ బరకం శ్రీని వాసులురెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, చెంగల శివశంకర్, బాస్ నాయకులు కృష్ణయ్య, గురునాథ, పల్లెపోగు హరినాథ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి):రోడ్డుప్రమాదంలో సాయికుమార్(25) అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు చౌడేపల్లె పోలీసులు తెలిపారు. బోయకొండకు చెందిన సాయికుమార్ మదనపల్లెకు వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని మదనపల్లె జిల్లాప్రభుత్వ ఆస్పత్రి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మదనపల్లె అర్బన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి):చికిత్స పొందుతూ సూర్యనారాయణ(70) అనే వృద్ధుడు మృతి చెందినట్లు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు తెలిపారు. మదనపల్లె పట్టణం, పూలవీధికి చెందిన సూర్యనారాయణను ఈనెల 23న ఆరోగ్యం సరిగ్గాలేక ఆస్పత్రిలో చేర్పించారన్నారు. కాగా శుక్రవారం ఆయన మృతి చెందాడన్నారు. మృతదేమాన్ని ఆసుపత్రి మార్చురికీ తరలించామన్నారు.





కన్నుల పండువగా లక్ష దీపోత్సవం

● వేలాదిగా తరలివచ్చి దీపాలు వెలిగించిన మహిళలు


బి.కొత్తకోటలో లక్ష దీపోత్సవంలో పాల్గొన్న భక్తాదులు

బి.కొత్తకోట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస లక్ష దీపోత్సవం బి.కొత్తకోటలో కన్నుల పండువగా జరిగింది. పట్టణానికి చెందిన శ్రీమహావిష్ణుసేన ప్రతియేటా కార్తీకమాసం చివరలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోంది. అదేవిధంగా ఈ ఏడాది కూడా శుక్రవారం వేడుకను నిర్వహించారు. పట్టణంలోని పీటీయం రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుంచి జ్యోతిసర్కిల్ వరకు సుందరంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు. దారి పొడవునా టేబుళ్లను అమర్చి వాటిపై లక్షదీపాలు, వాటిలో తైలం వేసేందుకు కళాశాల విద్యార్థినులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సాయంత్రం తిరుపతి శ్రీనివాస మంగాపురానికి చెందిన లలితపీఠ వ్యవస్థాపక పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్యులు స్వరూపానందగిరి స్వాముల వారిచే ప్రత్యేక పూజా కార్యక్రమాలతో వేడుకను ప్రారంభించారు. పట్టణంలో నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా మహిళామణులు కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. ఏటా ఈ లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న శ్రీమహావిష్ణుసేన ప్రతినిధులను పలువురు ప్రశంసించారు. సీఐ రాజారెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. నగర పంచాయతీ కమిషనర్ జీఆర్ పల్లవి, ఏవో రమాదేవిలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు.



పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లె లోని ములకలచెరువు మెయిన్ రోడ్డు పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఇది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులతోపాటు మెయిన్ రోడ్డుపై వచ్చే వాహనదారులు భయపడిపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

-పెద్దతిప్పసముద్రం, (ఆంధ్రజ్యోతి)

వెయ్యిమంది పేదలకు ఇళ్ల స్థలాలు

● సీఎం చేతుల మీదుగా పంపిణీ చేయిస్తాం ● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


కోళ్లబైలులో పేదలకు ఇళ్ల స్థలాల లేఅవుట్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె/టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని వెయ్యి మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోకి కోళ్లబైలు గ్రామం సర్వేనెంబర్ 602, 603, 604లో పదెకరాల ప్రభుత్వ భూమి ఆయన పరిశీలించారు. దీంతో పాటు ఇదే ప్రాంతంలో మరో 15 ఎకరాలు భూమి సేకరిస్తామన్నారు. ప్రస్తుతానికి ఐదెకరాల్లో లేఅవుట్ వేసి 150 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి 2 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయ్యాక వెయ్యి మందికి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామన్నారు. కోళ్లబైలు పంచాయతీలో రూ.1.50కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. తక్కువ సమయంలోనే ప్రభుత్వ స్థలాన్ని గుర్తించిన రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, హౌసింగ్ డీఈ రమేశ్‌రెడ్డి, దీనదయాళ్, ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్వో నారాయణ, టీడీపీ నాయకులు రాటకొండ శ్రీనివాసులు, నవీన్, కె.కృష్ణ పాల్గొన్నారు. మదనపల్లె పట్టణం అవెన్యూరోడ్డులోని శ్రీకృష్ణ మున్సిపల్ స్కూల్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా భూమి పూజ చేశారు. రూ.14లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టే ఈ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజతో కలసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే మాస్టర్‌మైండ్ స్కూల్‌లో రూ.10లక్షల వ్యయంతో రెండు చోట్ల సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు కమిషనర్ క్షేప్రమీల ఆధ్వర్యంలో మెప్మా కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సమావేశంలో కౌన్సిలర్ వాయిస్ కరీముల్లా, ఎస్.ఎ.మస్తాన్, సీఎంఎం మధుసూదన్‌రెడ్డి, మహిళ సంఘాల లీడర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన టీడీపీ నేతలు


చంద్రబాబుతో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి, తెలుగు యువత శ్రీరామ్‌చినబాబు

ములకలచెరువు/మదనపల్లె టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఈ సందర్భంగా నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు తమ్ముడు రామ్మూర్తి నాయుడు దశదిన కార్యక్రమానికి జయచంద్రారెడ్డి హాజరై నివాళులర్పించారు. కాగా తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు శుక్రవారం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలుగు యువత ఆధ్వర్యంలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు గురించి చంద్రబాబుకు వివరించారు. అనంతరం రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్‌ను చినబాబు కలిసారు. ఆయన వెంట టీడీపీ జల్లా ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామినాయుడు పాల్గొన్నారు.

కోళ్లబైలు-2 ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్

మదనపల్లె టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు-2 గ్రామం ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ ఇస్తూ డీపీవో బాలకృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కోళ్లబైలు-2 సర్పంచ్ శశికళ అధికారులకు తెలపకుండా విదేశాలకు వెళ్లడంపై డీఎల్‌పీవో నాగరాజు విచారణలో తేలింది. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి, డీఎల్‌పీవో విచారణలో సర్పంచ్ హాంగ్‌కాంగ్‌కు వెళ్లారని తెలిసి సంజాయిషి నోటీసుకు బదులు లేఖ కూడా సర్పంచ్ జిరాక్స్ పంపినట్లు తెలిసింది. అందులోనూ ఆ లేఖలో సంతకం ఆమెదా? కాదా? అన్నది తేలాల్సి ఉంది. ఈ క్రమంలో ఉపసర్పంచ్ నాగరాజుకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. అలాగే గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్స్, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల విత్‌డ్రాను ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి, 15వ ఆర్థిక సంఘం నిధులు ఉపసర్పంచ్‌కు, ఈవోఆర్డీ కౌంటర్ సంతకాలతోనే విత్‌డ్రా చేయాలని డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉపసర్పంచ్ నాగరాజు సచివాలయానికి చేరుకుని పంచాయతీ కార్యదర్శి, ప్రజలతో చర్చించారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి


లక్ష్మీపురం సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న అధికారులు, స్థానిక ప్రజలు

పీలేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని లక్ష్మీపురం కాలనీ వాసులు తమ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. లక్ష్మీపురంలో శుక్రవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘ నాయకులు, లక్ష్మీపురం వాసులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అదే విధంగా తమ కాలనీలోని సుమారు 100 కుటుంబాలకు ప్రభుత్వం అందజేస్తున్న 200 యూని ట్ల ఉచిత విద్యుత్ పథకం అందడం లేదన్నారు. కాలనీ సమీపంలోనే శ్మశాన వాటిక కేటాయిం చాలని, రేషన్ సరుకుల పంపిణీ కోసం రేషన్ డీలర్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలో మురుగునీటి వ్యవస్థ సరిగ్గా లేనందువల్ల తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోయారు. ఈ సందర్భంగా తహసీల్దారు భీమేశ్వర రావు మాట్లాడుతూ లక్ష్మీపురం ప్రాంత సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో లోకేశ్వర రెడ్డి, ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, ఎస్ఐ లోకేశ్, డీటీ సుబ్రహ్మణ్యం, దళిత సంఘ నేతలు గండికోట వెంకటేశ్, జెట్టి మల్లిఖార్జున, తుమ్మల ధరణీకుమార్, ఎన్.సుధాకర్ బాబు, దుర్గాప్రసాద్, అంజమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

ములకలచెరువు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ మలేరియా జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని తంబళ్లపల్లె మలేరియా అధికారి శ్రీనివాసులు సూచించారు. ములకలచెరువు, రాగిమానిపల్లెలలో శుక్రవారం ముందు జాగ్రత్త చర్యగా నీటి తొట్లెలు, నీరు నిల్వ ఉన్న చోట అబేట్ ద్రావణం పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉష, ఆశా కార్యకర్తలు సల్మా, కళావతి తదితరులు పాల్గొన్నారు.